విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 29 జులై 2025 8 పేజీలు



కబ్జాకు కాదేది అనర్హం

- దర్జాగా 94 సెంట్ల ప్రభుత్వ భూమి కబ్జా
- అధికార పార్టీ నేతగా చెలామణి అవుతున్న ఆక్రమణదారుడు
- పట్టించుకోని మండల రెవిన్యూ యంత్రాంగం

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : కబ్జాకు కాదేది అనర్హం అని ఆక్రమణదారులు రుజువు చేస్తున్నారు. గజం భూమి కనబడితే కబ్జా చేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఏకంగా 94 సెంట్లు ప్రభుత్వ పోరంబోకు భూమిని ▶మిగతా 4లో..

భవన నిర్మాణ కార్మికుల

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

తహసీల్దారు కార్యాలయాల ఎదుట ధర్నా

నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించ లేదని విమర్శించారు. అపరిష్కృతంగా ఉన్న 46వేల క్లైములను వెంటనే పరిష్కరించాలన్నారు.

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగులో ఉన్న 46 వేల క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం ఏఐటీయూసీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా తాడేపల్లిగూడెం తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆ మేరకు తాడేపల్లిగూడెం తహసీల్దారు కార్యాలయం వద్ద ఏరియా తాపీ వడ్రంగి, సెంట్రింగ్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డి.సోమసుందర్, ఓసూరి వీర్రాజు, కళింగ లక్ష్మణరావు, భవన నిర్మాణ కార్మిక

సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, ఏరియా కార్యదర్శి అత్తిలి బాబీ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా భవన అనంతరం సమస్యలపై తహసీల్దార్ సునీల్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు బోడపాటి నాగేశ్వరరావు, అధ్య క్షుడు దువ్వా శ్రీనివాస్, జిల్లా నాయకులు అంకం భాస్కర రావు, రౌతు శ్రీనివాసరావు, మెండెం జేమ్స్, కోడే సాయి బాలాజీ, ఏరియా ▶మిగతా 2లో..

పంచాయతీరాజ్‌లో 10 వేల మందికి పదోన్నతులు

ఓఎస్‌డి వెంకటకృష్ణ

విశాలాంధ్ర - సామర్లకోట : ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో పది వేల మందికి పైగా పదోన్నతులు వచ్చాయని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఓఎస్‌డి వెంకటకృష్ణ అన్నారు. ఎంపీడీఓలుగా పదోన్నతులు పొందిన వారికి సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో నెల రోజుల ప్రాథమిక శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత ప్రజాహితంగా మార్చేందుకు ఉప ముఖ్యమంత్రి అంకితభావంతో పనిచేస్తున్నారని అన్నారు. ప్రజలకు సేవలు మెరుగుపర్చడంతోపాటు, ఉద్యోగు లందరికీ సకాలంలో పదోన్నతులు వచ్చేలా ఉపముఖ్య

మంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. ఎంపీడీఓలుగా పదోన్నతులు పొందిన వారు సమన్వయ, పరిపాలన నైపుణ్యాలు మెరుగు పరుచుకోవాలని ఓఎస్‌డి పిలుపు నిచ్చారు. మండలంలోని అందరు ఉద్యోగులు సమన్వయం చేసుకుంటూ ▶మిగతా 2లో..

మానవ అక్రమ రవాణా నిరోధానికి చర్యలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో మానవ అక్రమ రవాణా నిరోధానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జులై 30న నిర్వహించే ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ ప్రచార గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుండి 30వ తేదీ వరకు పిల్లల అక్రమ రవాణా వ్యతిరేకంగా జిల్లాలో పక్షోత్స వాలు నిర్వహించుకుంటున్నామన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో

పాఠశాలల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మానవ అక్రమ రవాణా నిరోధానికి అత్యవసర సమ యాల్లో హెల్ప్ లైన్ నెంబర్లు 1098, 1800 1027 222 గురించి జిల్లాలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, డిపిఓ ఎ.రామనాథరెడ్డి, చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆర్.శీనివాసరావు, ఐసిడిఎస్ పిడి డి.లక్ష్మి డిఈఓ ఇ.నారాయణ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొడక్షన్ ఆఫీసర్ ఆర్.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు న్యాయం చేయండి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సత్తిబాబు డిమాండ్

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురంలో టిడ్కో ఇళ్ల లబ్దిదారులు 72 మందికి టిడ్కో ఫ్లాటైనా ఇవ్వండి లేదా వారు చెల్లించిన డిపాజిట్లు వడ్డీతో చెల్లించండి అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కె.సత్తిబాబు డిమాండ్ చేశారు.

సోమవారం టిడ్కోలబ్ది దారులు తమకు ఫ్లాట్ అయినా ఇవ్వండి లేదా తాము కట్టిన డిపాజిట్ వడ్డీతో తిరిగి చెల్లించండి అని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టర్ కార్యా లయం వద్ద నిరసన తెలియజేశారు. గత ప్రభుత్వం తమ పాలనా కాలంలో టిడ్కోసంస్థ లబ్దిదారులను కనీసం పట్టించుకోకుండా సాచివేత ధోరణి అవలంబించిందన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని సత్తిబాబు విజ్ఞప్తిచేశారు. అదే సమయంలో జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కౌన్సిల్ సమావేశం పాల్గొని సదరు 72 మంది టిడ్కో లబ్ది దారులు చెలించిన 72 లక్షల రూపాయలు పైన ఆరాతీసారు. మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కూమార్ మాట్లాడుతూ ఆ నిధులు మున్సిపాల్టిలో లేవని టిడ్కోసంస్థకు వెళ్లి పోయాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం విధాన నిర్ణయం చేయాల్సి ఉంటుందని వివరించారు.

అర్జీలకు సంతృప్తికర పరిష్కారం అందించాలి

కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు, ఎస్ఎస్ఏ పీవో వేణుగోపాలరావు, సీపీవో పి. త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసు, జీజీహెచ్ ఎస్డీసీ ఎన్. శ్రీధర్‌లతో కలిసి హాజరై, జిల్లా చుట్టుప్రక్కల ప్రజల నుంచి వచ్చిన వినతులు, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికర మైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు.

బియ్యం కార్డు మంజూరు, కార్డులోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, తల్లికి వందనం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణల తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, తల్లికి వందనం ఆన్ లైన్ సమస్యలు వంటి అంశాలకు చెందిన మొత్తం 921 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఒకే అంశంపై నమోదయ్యే దరఖాస్తుల పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

పునరుద్ధరించాలి

(1వ పేజీ తరువాయి)

కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ కార్మికుల ధర్నా

తాడేపల్లిగూడెం మండలంలోని పలు గ్రామాల నుంచి గోదావరి గ్రామీణ భవననిర్మాణ కార్మిక సంఘం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తరలివచ్చిన భవన నిర్మాణ కార్మికులు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వారు కూడా మరో వినతి పత్రాన్ని తహసీల్దారుకు అందజేశారు. కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు గంధం సత్యనారాయణ, కోశాధికారి కంకిపాటి రాజు, కమిటీ నాయకులు తదితరులు నాయకత్వం వహించారు.

ఏలూరు: రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని ఏఐటీయూసీ డిమాండ్

చేసింది. ఏలూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాను ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా నాయకులు పి. కిషోర్ మాట్లాడుతూ లక్షలాది మంది కార్మికులు భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారన్నారు. ఏఐటీయుసి, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అనేక సంవత్సరాల పోరాట ఫలితంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు ద్వారా నిర్మాణ కార్మికులకు ప్రమాదాల్లో గాయపడిన వారికి నష్టపరిహారం, కార్మికుల పిల్లల చదువులకు, వివాహాలకు కానుకల రూపంలో డబ్బులు అందించే వారని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను వేరే పథకాలకు కేటాయించి పక్కదారి పట్టించారని విమర్శించారు. దాంతో ప్రస్తుతం కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నుండి రావలసిన క్లైములు చెల్లించకపోవడం వల్ల వేలకొలది క్లైములు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు తన సొంత నిధులనుండి కోటి రూపాయలు జమ చేస్తానని కూడా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు, సంజీవని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి (బుజ్జి) మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదాలకు గురై పనులు చేయలేని కార్మికులకు, వయసు పెరిగి అనారోగ్యంతో పనులు చేయలేని కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నిధుల నుండి పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం అర్బన్ తహసీల్దారుకు ఏఐటీయూసీ నాయకులు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, నాయకులు కడుపు కన్నయ్య,యర్రా వెంకటేశ్వర్లు, బుగ్గల ప్రభాకర్, బి. జగన్నాధరావు, ఎస్ఎంవి సుబ్బారావు, ఎ. సీతారాం బాబు, రంగా, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి కుంచె వసంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం భవన నిర్మాణ కార్మికులతో సోమవారం జరిగిన

సమావేశంలో ఆయన మాట్లాడారు.కార్మికుల్లో సింహ భాగంగా ఉన్న భవన నిర్మాణ రంగ వర్కర్ల పరిస్థితి దారుణంగా ఉందని వారి సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో కార్మికుల నిధులు పక్కదారి పట్టడం వలన కార్మికుల కుటుంబాలకు చెల్లించాల్సిన క్లైములు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. సత్వరమే బోర్డును పునరుద్ధరించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. అనంతరం జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టి ఎమ్మార్వో స్లీవజోజికి వినతిపత్రం అందజేశారు. సమావేశంలో సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు, సహాయ కార్యదర్శి సుంకర రాధాకృష్ణ, భవన నిర్మాణ వర్కర్స్ జంగారెడ్డిగూడెం మండల యూనియన్ నాయకులు చిలంతరాజుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు

భీమవరం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పున: ప్రారంభించాలని భవన నిర్మాణం కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ డిమాండ్

చేశారు రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం పిలుపుమేరకు సోమవారం పెంటపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఏరియా కమిటీ గౌరవ అధ్యక్షులు బోడపాటి నాగేశ్వరరావు. జిల్లా కార్యవర్గ సభ్యులు కోడే సాయి బాలాజీ, ఏఐటీయూసీ ఉప కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ సంక్షేమ బోర్డు వెంటనే ప్రారంభించాలని, బోర్డు సభ్యులను నియమించి బోర్డు సమావేశం వేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ క్లెయిమ్స్ మొత్తం క్లియర్ చేయాలని, వెల్ఫేర్ బోర్డులో కార్మికుల నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు వార్డు, గ్రామ సచివాలయంలో నమోదుకు అవకాశం కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మద్దూరు సత్యనారాయణ, పిళ్ళంగోల కృష్ణ, తోట సత్యనారాయణ ,కొడకట్ల మరియా, పెరికల శివరామకృష్ణ, ఐతం వెంకన్న బాబు, సందాక కొండ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ కుక్కునూరు మండల కన్వీనర్ కొన్నె లక్ష్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కుక్కునూరు భవన నిర్మాణ కార్మికులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన

మాట్లాడారు. కార్మికుల్లో సింహ భాగంగా ఉన్న భవన నిర్మాణ రంగ వర్కర్ల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. వారి సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో కార్మికుల నిధులు పక్కదారి పట్టడం వలన కార్మికుల కుటుంబాలకు చెల్లించాల్సిన క్లైములు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.తాము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం కుక్కునూరు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టి ఎమ్మార్వో రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, భవన నిర్మాణ వర్కర్స్ కుక్కునూరు మండల అధ్యక్షుడు కుండా సాంబయ్య, కార్యదర్శి దుక్కిపాటి మహేష్, ఉపాధ్యక్షులు వీరమల్ల రాజేష్, సహాయ కార్యదర్శులు రమేష్, సంపత్, వలి, నాగరాజు, వెంకటేష్, మనోహర్, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు : భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, పాత క్లైములు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల కార్యదర్శి కారం దారయ్య మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అనేక పోరాటాల ఫలితంగా భవన నిర్మాణ కార్మికుల

సంక్షేమానికి బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డును సాధించుకున్నామన్నారు. ఆ బోర్డు నిధుల ద్వారా భవన నిర్మాణ కార్మికులకు ప్రమాదాలు జరిగినప్పుడు నష్టపరిహారం, తమ పిల్లల చదువులు, వివాహాలకు తదితర రూపాల్లో కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేవారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డు నిధులను పక్కదారి పట్టించడం వల్ల భవన నిర్మాణ కార్మికులకు చెందవలసిన వెల్ఫేర్ ఫండ్ నిధులు వర్తించడం లేదన్నారు. దీంతో క్లైములు పెండింగ్లో ఉన్నాయన్నారు. వెంటనే భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి వారికి ఇవ్వవలసిన నిధులు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.కె ఖలీల్, రాజేష్, నాని, కృష్ణ, చంటి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం: భవన నిర్మాణ కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని తాపీ పనివారల సంక్షేమ సంఘం కోరింది. సోమవారం ఆ సంఘం నాయకులు తహసీల్దార్ అయితం సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికులకు మొండిచేయి చూపడంతో ఉపాధి కోల్పోయారని అన్నారు. రాష్ట్రంలో భవన నిర్మాణ సంక్షేమ చట్టం అమలైన నాటి నుంచి కార్మికులకు 12రకాల సౌకర్యాలు కల్పించే వారన్నారు. లేబర్ డిపార్ట్మెంట్ ద్వారా క్లైములు పరిష్కారం చేసి కార్మికుల

జీవితాలలో వెలుగులు నింపారన్నారు. 2019లో జగన్ ప్రభుత్వం సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేస్తూ జీవో నెం.1214ను ప్రవేశపెట్టిందన్నారు. కార్మికుల సంక్షేమ పథకం నిధులను వైసీపీ ప్రభుత్వ అవసరాలకు మళ్ళించి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. 46వేల క్లైములను పరిష్కరించ కపోవడం వల్ల కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. జీవో నెం.1214 రద్దుచేసి భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్‌లో ఉన్న క్లైములను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆకుల శ్రీనివాసరావు, పోతురాజు, హరిరామకృష్ణ, మల్లుల సత్యనారాయణ, దివి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించా లని కోరుతూ చింతలపూడి తహసీల్దార్ కార్యాలయంలో బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నేతలు వినతిపత్రం సమర్పించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చేపలి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులు

పడుతున్నారని తెలిపారు. సంక్షేమ బోర్డులో ఉన్న వేలాది రూపా యలను ఇతర పథకాలకు ఉపయోగిస్తున్నారు తప్ప కార్మికులకు ఉపయోగించడం లేదని అన్నారు. సంక్షేమ బోర్డులో ఉన్న డబ్బులను కార్మికుల శ్రేయస్సుకు ఉపయోగించడం కోసం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జూపుడు వసంత, ఎస్కే సుభాని, చుండ్రు కృష్ణ, ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు

(1వ పేజీ తరువాయి)

మంచి నాయకులుగా పని చేయాలని కోరారు. నెల రోజుల శిక్షణ తర్వాత ఎంపీడీఓల పరిపాలన తీరులో మార్పు వస్తుందని వెంకటకృష్ణ ఆకాంక్షించారు. అనంతరం శిక్షణ కేంద్రం పరిశీలించి ప్రిన్సిపల్, అధ్యాపకులకు తగు సూచనలు చేశారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి తొలి బ్యాచ్‌లో 46 మంది ఎంపీడీఓలు ఈ శిక్షణకు వచ్చారు. ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపల్ కెఎన్‌వి ప్రసాదరావు, ఉప ప్రిన్సిపల్ జి.రమణ, డిడిఓ శ్రీనివాసరావు, నాతి బుజ్జి, ఉపాధి పథకం ప్రత్తిపాడు ఏపిడి భానుప్రకాష్, ఎంపీడీఓలు ఎస్ఎస్ శర్మ, సుశీల, శ్రీలత పాల్గొన్నారు.

కైకలూరు ఫోటో గ్రాఫర్స్ నూతన కార్యవర్గం

విశాలాంధ్ర-కైకలూరు: కైకలూరు నియోజకవర్గ ఫోటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో నిర్వహించారు. ఈ ఎన్నికలో

సంఘ గౌరవ అధ్యక్షులుగా కనగాల శ్యాం సువర్ణరావు, నరహరశెట్టి శ్యాంబాబు ఎంపికయ్యారు. సంఘ అధ్యక్షుడిగా దుర్గం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా చాబత్తిన ప్రేమ్ కిరణ్, కార్యదర్శిగా కొచ్చర్ల సుకుమార్, ఉప కార్యదర్శిగా వాసుపల్లి సతీష్ కన్నా, కోశాధికారిగా ఘంటసాల రామకృష్ణ, సంఘ వి ఆర్ఓ సభ్యులుగా కనగాల సుమంత్ బాలాజీ, కార్యవర్గ సభ్యులుగా బోడావుల నాగరాజు, పండరెడ్డి శివ వరప్రసాద్, అంబటి హర్షవర్ధన్, బట్టేలంక అయ్యప్ప, ఏకుల వేణు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ సమస్యలు ఎన్ని ఎదురైనా అందరం ఐకమత్యంగా అసోసియేషన్‌ను ముందుకు నడిపే విధంగా కృషి చేయాలని కోరారు. విధి నిర్వహణలో సమస్యలు తలెత్తితే కార్యవర్గ సభ్యులకు తెలపాలని అసోసియేషన్ కోసం నిరంతరం కష్టించి పనిచేసి అభివృద్ధి పథంలో యూనియన్‌ను నడిపేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.

చర్చి నిర్మాణానికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర-టి నరసాపురం: మండలంలోని బంధంచర్ల గ్రామంలో ఆర్‌సిఎం చర్చి నిర్మాణానికి గ్రామానికి చెందిన వైఎస్సార్ సిపి ఏలూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు, కె

జగ్గవరం సొసైటీ మాజీ చైర్ పర్సన్ వాసిరెడ్డి మధు, కుటుంబ సభ్యులు రూ.లక్ష రూపాయల చెక్కును సోమవారం చర్చి సంఘస్తులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి మధు మాట్లాడారు. అనంతరం గ్రామస్తులు, సంఘస్తులు దాతలు వాసిరెడ్డి మధు కుటుంబ సభ్యులను అభినందించి కృతజ్ఞతలు తెలియజేసారు.

విద్యార్థులు కంటి ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర -భీమవరం: విద్యార్థులు కంటి ఆరోగ్యం పై శ్రద్ధ పెట్టాలని ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ యు.వి.రమణ రాజు అన్నారు. ఆర్.ఆర్.డి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కంటి సంరక్షణ, ప్రాధాన్యతపై దృష్టి సారించాల న్నారు. స్పష్టమైన చూపుతో అధ్యయనం చేసి బంగారు భవిష్యత్తు సొంతం చేసుకోవాలని సూచించారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె ప్రసూన మాట్లాడుతూ అంధ విద్యార్థులను ఎంతో మందిని చదివిస్తూ డాక్టర్ రమణ రాజు చేస్తున్న సేవ అభినందనీయమని తెలిపారు. తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ ఉచిత నేత్ర పరీక్ష చేసి అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు అందజేయడం ప్రశంసనీయమని ఆమె కొనియాడారు. కార్యక్ర మంలో కళాశాల ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ డాక్టర్ అరవిందస్వామి, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు, డి.వి.వి.సి.హెచ్ సత్యనారాయణ, జి.ప్రసాద్ బాబు, యూత్ రెడ్ క్రాస్ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

కొండగూడెం వన సంరక్షణ సమితిని పునరుద్ధరించండి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం

విశాలాంధ్ర-ఏలూరు: కామవరపుకోట మండలం కామవరపుకోట కొండగూడెం వన సంరక్షణ సమితిని పునరుద్ధరించాలని, కొండగూడెం అటవీ బంజరులో పేదలు పెంచిన మొక్కలను ఫారెస్ట్ గార్డు నరక

దాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ సోమవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో నాయకులు జిల్లా అటవీ శాఖ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం కామవరపుకోట మండల నాయకులు గుమ్మడి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కామవరపుకోట పేద ప్రజలు గత 20 సంవత్సరా లుగా కొండ గూడెం అటవీ బంజరులో వన సంరక్షణ సమితి ద్వారా మొక్కలు నాటారని జిల్లా అటవీ శాఖ అధికారికి వారు వివరిం చారు. అల్లంచర్ల రాజుపాలెం బీట్, కంపార్ట్ 225లో అటవీ బంజరును కామవరపుకోటకు చెందిన వివిధ కులాల పేద ప్రజలు తుప్పలు నరికి మొక్కలు నాటి పెంచుతున్నారని వారు తెలిపారు. ఫారెస్ట్ గార్డు ఎక్కడ వి.ఎస్ఎస్ లేదని,పేద ప్రజలు పెంచిన మొక్కలను నిర్దాక్షిణ్యంగా నరుకుతున్నారని వారు డిఎఫ్ఓకు తెలిపారు. తక్షణమే పెరిగిన మొక్కలను నరకకుండా చర్యలు తీసుకోవాలని, ఫారెస్ట్ శాఖ రికార్డులలో కొండగూడెం వివిఎస్ ఉంటే దానిని పునరుద్ధరించాలని,రికార్డులో వివిఎస్ లేకపోతే కొత్త వివిఎస్ ను ఏర్పాటు చేయాలని డిఎఫ్ఓకు వారు విజ్ఞప్తి చేశారు. డీఎఫ్ఓ సతీష్ స్పందిస్తూ ప్రస్తుతం పెరిగిన మొక్కలను నరకకుండా చర్యలు చేపడతామని, వీఎస్ఎస్ ఉంటే దాన్ని సక్రమంగా పనిచేసే లాగా చేస్తామని, వివిఎస్ రికార్డులలో లేకపోతే కొత్త వివిఎస్ ఏర్పాటుకు ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.జిల్లా అటవీ శాఖ అధికారిని కలిసిన వారిలో నాయకులతోపాటు బందెల ఏసుపాదం, నల్లపోతుల వెంకటేశ్వరరావు, పరసా శ్రీను, బి.అబ్రహం, సిహెచ్. రాము తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలి

వామపక్షాల సంతకాల సేకరణ

విశాలాంధ్ర- చింతలపూడి : స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. సోమవారం చింతలపూడి పాత బస్టాండ్‌లో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు, సీపీఎం

మండల కన్వీనర్ పి.పాండురంగా రావు, మాట్లాడుతూ విద్యుత్ భారాలను ప్రజలపై మోపుతూ స్మార్ట్ మీటర్ల బిగింపు విధానానికి వ్యతిరేకంగా ఆగస్టు 5వ తేదీ విద్యుత్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలను సమాయత్తం చేయడం కోసం సంతకాల సేకరణ చేపట్టామన్నారు. దానిలో భాగంగా చింతలపూడి పాత బస్టాండ్ వద్ద ప్రారంభించిన సంతకాల సేకరణ నాలుగు రోజుల పాటు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు సర్వేశ్వరరావు, సిపిఎం నాయకులు ఆర్వి సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.సత్యనారాయణ, పి.జోషి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కంచర్ల గురవయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దంతా కృష్ణ, రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్కే కాలేషా, తాడిగడప మాణిక్యాలరావు, సిపిఐ నాయకులు మార్తా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ స్మార్ట్ మీటర్లను తిరస్కరించండి

విశాలాంధ్ర-ఏలూరు: విద్యుత్ స్మార్ట్ మీటర్లు ట్రూ ఆఫ్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాన్ని బలపరచాలని ప్రజలకు వామపక్ష ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయి.

విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజాసంఘాలు ఇచ్చిన ఆందోళనలో భాగంగా సోమవారం బస్టాండ్ ఎదురుగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు, ఐ.ఎఫ్.టి.యు., రాష్ట్ర కమిటీ సభ్యులు సరియం రామ్మోహన్, సిఐటియు పట్టణ కార్యదర్శి పసల సూర్యారావులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు విద్యుత్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు ఎటువంటి నష్టం లేదని కరెంటు బిల్లులు కట్టకోవడానికి సౌలభ్యంగా ఉంటుందని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని వీటిని ప్రజలు నమ్మవద్దని హెచ్చరించారు. ప్రజల సంపదను కొద్దిమంది కార్పొరేట్ సంస్థలకు కట్ట పెట్టడానికి కుట్ర చేస్తున్నారని, భారత సంచార్ నిగం లిమిటెడ్ బిఎస్ఎన్ఎల్ కి 4జి.ఇవ్వకుండా జియోకి ఐడియా ఎయిర్టెల్ తదితర ప్రైవేటు వాటికి ఇచ్చి భారతమాత ఆస్తిని, బిఎస్ఎన్ఎల్‌ను దివాలా తీయించిన విధంగా విద్యుత్ సంస్థలను కూడా నష్టపరచడం కోసం అదాని కుట్రలు చేస్తున్నా రని విమర్శించారు. బిల్లుచెల్లింపులో వెసులు బాటు లేకుండా ప్రజలను భయాందోళనకు గురిచేస్తూ స్మార్ట్ మీటర్లు వస్తున్నాయని విమర్శించారు. స్మార్ట్ మీటర్లే కాకుండా ట్రూ ఆఫ్ చార్జీల పేరు మీద నేడు ఒక్కొక్క యూనిట్‌కు రూ. 3.50 పైసలు అదనంగా పడుతుందని ఇది ప్రజలు మోయలేని భారం కూటమి ప్రభుత్వం వేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల గౌరవాధ్యక్షులు జేవీ రమణ రాజు, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సుంకర రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొలిమే బాలయేసు, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర సహాయ కార్యదర్శి కెవి రమణ, డివైఎఫ్ఐ నాయకులు మాబూ సుభాని, వంగా గోపి, చందా త్రిమూర్తులు, చింతల రాజు, ఆంజనేయరాజు,బేతి కిషోర్, తాళ్లూరి నాగరాజు, మంచర్ల ప్రభాకర్ రావు, హను మంతు, ఐఎఫ్‌టియు పట్టణ కార్యదర్శి మొల్లేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధర్మస్థల ఘటనల దర్యాప్తును వేగవంతం చేయాలి

ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ.డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: ధర్మస్థల ఘటనల దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల కర్ణాటక, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాచార రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు కుక్కునూరు మండలంలోని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకశ్యామల నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆమె మాట్లా డుతూ గత 10 రోజులుగా వెలుగు లోకి వస్తున్న కర్ణాటక రాష్ట్రంలోని మంజునాథ దేవాలయం ధర్మస్థలంలో వందలాది మంది యువతులు, మహిళలపై దారుణమైన అత్యా చార ఘటనలు ఆందోళనను కల్గిస్తున్నాయ న్నారు. ఈ ఘటనలపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమాల పేరుతో, ఆలయాల పేరుతో, ఆధ్యాత్మిక చింతన పేరుతో, భక్తి పేరుతో మహిళలను వంచిస్తూ, సమాజంలో పెద్ద మనుషులుగా మతగురువు లుగా, చెలామణి అవుతూ మహిళల మాన ప్రాణాలను హరించివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దోషులు ఎవరైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపార్వతి, ఆదిలక్ష్మి, జ్యోతి, లక్ష్మి ,సిహెచ్ లక్ష్మి రాజేశ్వరి ,రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా తొలి అడుగు ప్రచారం

విశాలాంధ్ర-లింగపాలెం: సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రంగాపురంలో సర్పంచ్ ముసునూరు రాము ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.కూటమి ప్రభుత్వం చేస్తున్న

అభివృద్ధి, సంక్షేమాన్ని ఈ సందర్భంగా వివరించారు. కూటమి ప్రభుత్వం పేదలను అభివృద్ధి చేయటంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని వివరించారు.

తెలుగుదేశం ఆవిర్భావం పేదల అభివృద్ధి కోసం పుట్టిన పార్టీ అని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఓబిల్లనేని శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

NAME CHANGE
I, hitherto knows as
CHINTHAGUNTA VEERASWAMY
S/o. Ch. Venkateswara Rao, R/o.
D.No : 4-30A, Thukkuluru, Nuzvid
Mandal, Krishna District – 521201
have change my name and shall
hereafter be known as
CHINTHAGUNTA VEERASWAMI

కూటమి ప్రభుత్వంతోనే నిరుపేదల సొంతింటి కల సాకారం

మంత్రి కొలుసు పార్థసారథి

విశాలాంధ్ర-కైకలూరు: కైకలూరు గ్రీన్ విలేజ్‌ను సోమవారం రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కైకలూరు శాసనసభ్యులు, గవర్నమెంటు అస్యూరెన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ కామినేని శ్రీనివాస్ సంయుక్తంగా సందర్శించి, పరిశీ లించారు. గ్రీన్ విలేజ్‌లో

గతంలో 3072 మంది లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలు ఇవ్వగా, 504 ఇళ్ళు పూర్తయి లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేశారని పేర్కొన్నారు. 2017 ఇళ్ళు నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని మంత్రి కొలుసు పార్థసారథికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ వివరించారు. కొన్ని ఇళ్ళు నిర్మాణ దశలో ఉన్నాయని, కొందరికి ఇళ్ల ప్లాట్లు చూపించవలసి ఉందని వివరించారు. మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ మిగిలిన ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని, గృహప్రవేశాలు చేసుకుని నివాసం ఉంటున్న త్రాగునీరు,విద్యుత్తు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని, కాలనీలో రోడ్లు, డ్రైనేజి, వీధిదీపాలు వంటి మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించాలని అధికారులను మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ఎండి యం.శివ ప్రసాదు, గృహ నిర్మాణ శాఖ పిడి జి.వి.సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు,గ్రీన్ విలేజ్ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులు అడ్డుకుంటే వైసీపీకి పుట్టగతులుండవు : మంత్రి పార్థసారథి

విశాలాంధ్ర-కైకలూరు: 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలోని అన్ని వనరులను దోచుకుని, దాచుకుని రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసిపికి ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా సిగ్గులేకుండా ప్రస్తుతం ప్రణాళికాబద్ధంగా చేస్తున్న రాష్ట్రాభివృద్ధిని కుట్రలు, కుతంత్రాలతో అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక సిఎస్ఆర్ గార్డెన్స్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి పార్థసారథి, స్థానిక శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ మాట్లాడారు.కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుంటే ప్రతిపక్ష హోదా కూడా లేని

వైసీపీ నాయకులు సంక్షేమాన్ని, అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. విదేశాల నుంచి పరిశ్రమల రూపంలో వచ్చే పెట్టుబడులు రాకుండా విధ్వంసం సృష్టిస్తున్నారని, చంద్రబాబుపై నమ్మకంతో అనేక సంస్థలు ముందుకు వచ్చి పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. పరిశ్రమల ద్వారా పెట్టు బడులు వస్తేనే ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్.డి.ఏ. ప్రభుత్వం రానున్న రోజుల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్ర మాలు విజయవంతంగా అమలు చేస్తుందని అన్నారు. పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ఎండి యం.శివప్రసాదు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, మాజీ శాసన సభ్యులు ఘంటా మురళీ రామకృష్ణ, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: ఏలూరు నియోజకవర్గ పరిధిలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేసేలా చర్యలు చేపడతామని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన స్థానిక కంద్రిక గూడెం ప్రాంతంలో పర్యటించి ప్రజ లను నేరుగా కలుసుకున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్య లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలలో ఒకటైన మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్ వయస్సు తగ్గింపు అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని అన్నారు. కార్యక్రమంలో నగర కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టిడిపి నేతలు చూడే వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలి

కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర -ఏలూరు: ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికలో ప్రజల నుంచి అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు.

సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో (పిజిఆర్ఎస్)లో ప్రజల నుంచి కలెక్టర్ కె. వెట్రిసెల్వి అర్జీలను స్వీకరించారు. అర్జీలను స్వీకరించిన వారిలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి,డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, డిఆఓ ఎం. వెంకటలక్ష్మమ్మ, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనరు భానుప్రతాప్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి ఎమ్. ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వేగవంతంగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి సార్ధకత ఉండాలి

విశాలాంధ్ర-లింగపాలెం : ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, ఈ వృత్తికి సార్ధకత కల్పించిన ప్రతి ఉపాధ్యాయునికి సమాజంలో మంచి గౌరవం ఉంటుందని మండల విద్యాశాఖ అధికారులు రామారావు, రవీంద్ర అన్నారు.

ఉపాధ్యాయ వృత్తిలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకొని విద్యార్థుల, విద్యార్థుల తల్లిదండ్రుల అభిమానాన్ని చూరగొన్న కుటుంబరావు మాస్టర్ సేవలు మరువలేనివని వీరు పేర్కొన్నారు. ధర్మాజీగూడెం బీసీ కాలనీ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ప్రమోషన్ పొంది ఆశన్నగూడెం మోడల్ ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వెళ్లిన కుటుంబరావును సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో అధికారులు,విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి,విద్యార్థులకు బోధన చేయడంలో మాస్టారు చూపించిన శ్రద్ధ మరువలేనిదని కొనియాడారు. పదోన్నతిపై బదిలీ అయిన కుటుంబరావును, ఉపాధ్యాయురాలిగా పని చేసి పదవీ విరమణ చేసిన ఈయన సతీమణి సత్యవతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ఉపాధ్యాయ సంఘ నాయకులు సొంగా నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంఈఓ బేతపూడి. వెంకటేశ్వరరావు పాఠశాలకు నూతనంగా బదిలీపై వచ్చిన ప్రధానోపా ధ్యాయులు కె.మరియ్య, ఉపాధ్యాయిని ఎస్. లత, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు బి.వి.ఎస్.ఎస్.రాజు, కాంప్లెక్స్ సెక్రెటరీ తిరుపతి ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

దేశంలో క్రిప్టో కరెన్సీ వాడకం, నియంత్రణపై కేంద్రం చర్యలు

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : దేశంలో క్రిప్టోకరెన్సీ వాడకం, నియంత్రణపై కేంద్రం చర్యలు తీసుకుంటుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. గత ఐదేళ్లలో దేశంలో క్రిప్టోకరెన్సీ వాడకం, నియంత్రణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలపై పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. భారత ప్రభుత్వం ఇప్పటి వరకు క్రిప్టోకరెన్సీ వాడకం గురించి ప్రత్యేకంగా ఎలాంటి అధ్యయనం నిర్వహించలేదని, క్రిప్టోకరెన్సీ లేదా వర్చువల్ డిజిటల్ ఆస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం- 2002 పరిధిలోకి 2023న మార్చి 7న కేంద్రం తీసుకువచ్చిందని కేంద్ర మంత్రి బదులిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం క్రిప్టో ఆస్తులను పరోక్షంగా పన్నుల విధానం, మనీలాండరింగ్ చట్టం, కంపెనీల వివరాల ప్రకటనల ద్వారా పర్యవేక్షిస్తోందని, నేరుగా నియంత్రణ కోసం అంతర్జాతీయ సహకారం అవసరం ఉందని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గతంలోనే ఖాతాదారులను హెచ్చరిస్తూ సలహాలు జారీ చేసిందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు... కూటమి ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, వంగలపూడి అనిత

విశాలాంధ్ర-కైకలూరు: కైకలూరు సియస్ఆర్ గార్డెన్స్ లో సోమవారం నియోజక వర్గంలో ఇళ్ళ నిర్మాణాలు,ఇళ్ల పట్టాలు,ఇతర సమస్యలపై రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత, శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ సంయుక్తంగా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజక వర్గంలో మండలాల వారీగా ఇళ్ల నిర్మాణాలు,ఇళ్ళ స్థలపట్టాలు, ఇతర సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో వచ్చే నాలుగేళ్లలో అర్హతగల ప్రతి పేదవానికి పక్కాఇల్లు నిర్మించాలన్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. .కైకలూరు నియోజక వర్గంలో గృహ నిర్మాణ సమస్యలపై స్థానిక సిఎస్ఆర్ గార్డెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. కైకలూరు గ్రీన్ విలేజ్, కలిదిండి, మండవల్లి మండలాల్లోని లే అవుట్లలో సమస్యలపై సమీక్ష నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చే నాలుగేళ్లలో అర్హత కలిగిన

మిగిలిన ప్రతి పేదవానికి అర్బన్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున నివేశనా స్థలాలు మంజూరు చేసి రూ.2.50 లక్షలు చొప్పున మంజూరు చేస్తుందని తెలిపారు. అదనంగా బీసీలకు,ఎస్సీలకు రూ 50 వేలు చొప్పున, ఎస్టీలకు రూ 75 వేలు నుంచి రూ 1 లక్ష చొప్పున అదనంగా నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు నిర్ణయించారన్నా రని తెలిపారు. ప్రత్యేక అతిథిగా హాజరైన రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అభివృద్ధి జరుగుతోందా లేదా అన్న విషయాలపై బాధ్యతా యుతంగా కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజల వద్దకు వెళ్లి తెలుసుకోవటం గర్వకారణం అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజక వర్గ పరిధిలో రక్షిత తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.2.40 కోట్లతో డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. కైకలూరు గ్రామ పంచాయతీ సమస్యను రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తామని, తాగునీరు, పారిశుధ్య సమస్యలకు పరిష్కారం చూపుతామని అన్నారు. సమావేశంలో ఏపీ గృహ నిర్మాణ ఎండి యం.శివ ప్రసాదు, మాజీ శాసన మండలి సభ్యులు కమ్మిలి విఠల్ రావు, మాజీ శాసన సభ్యులు ఘంటా మురళీరామకృష్ణ, గృహ నిర్మాణశాఖ పిడి జి.వి.వి. సత్యనారాయణ, డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు, డ్వామా పిడి కె.వి. సుబ్బారావు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి కె.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అనర్థం (1వ పేజీ తరువాయి

దర్జాగా ఒక నాయకుడు ఆక్రమించుకొని సాగు చేస్తున్నప్పటికీ స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడం పట్ల తీవ్ర అనుమానాలు, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆక్రమణ ఎక్కడో మారుమూల ప్రాంతంలో జరిగిందంటే పొరపాటు పడినట్లే. జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న ద్వారకా తిరుమలలోని వెంకటేశ్వర స్వామి దేవాలయానికి సమీపంలో ఉన్న భూమి కావడం విశేషం. ప్రస్తుతం ఈ భూమి ధర మార్కెట్ విలువ ప్రకారం రూ.2 కోట్లు ఉండగా ఇంతటి విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాదారుల కబంధ హస్తాల నుండి స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ భూమికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ద్వారకాతిరుమల మండలంలోని దొరసానిపాడు గ్రామంలో సర్వే నెంబరు 308లో 94 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి శ్రీవారి ఆలయానికి అతి సమీపంలో ఉండటంతో సెంటు భూమి రూ.1.50 లక్షలు పలుకుతుంది. దీని ప్రకారం 94 సెంట్లు భూమి రూ.1.41 కోట్లు విలువ ఉంటుంది. దొరసానిపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఈ భూమిపై కన్ను పడింది. అను కున్నదే తడవుగా గత వైసీపీ ప్రభుత్వంలో భూమిని ఆక్రమించి సాగు చేసుకున్నాడు. దీంతో ఈ వ్యవహారాన్ని గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు భూమిని స్వాధీనం చేసుకున్నందుకు ప్రయత్నిం చారు. అప్పటికే ఆ ప్రభుత్వ భూముల్లో ఆక్రమణదారుడు వరి సాగు చేస్తుండడంతో గ్రామానికి చెందిన వైసీపీ నేతను ఆశ్రయించి పంటను కాపాడుకున్నాడు. తదనంతరం ఈ ప్రభుత్వ భూమి వ్యవహారం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో మండల రెవెన్యూ అధికారులు ఆక్రమణదారుడి నుండి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఏదాది క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామానికి చెందిన ఇరువురు తెదేపా నేతల సహకారంతో తిరిగి ఇదే ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని సాగు మొదలుపెట్టాడు. ఈ విషయంపై ప్రశ్నిస్తున్న స్థానికులను సదరు ఆక్రమణదారుడు టీడీపీ నేతగా చెప్పుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపణలు ఉన్నాయి. ఎంతో విలువైన ప్రభుత్వ భూమిని దర్జాగా ఆక్రమణ చేసినప్పటికీ రెవిన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పట్ల పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక టీడీపీ నేతల సహకారంతో పాటు రెవెన్యూ అధికారుల లోపాయికారి సహకారం కూడా ఉండడం వల్లే ఇంతటి విలువైన భూమి దర్జాగా ఆక్రమించాడనే విమర్శలు లేకపోలేదు. వాస్తవానికి ప్రభుత్వ భూములను పరిరక్షించా ల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉంది. ప్రస్తుతం అధికారులు ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఆయా స్థలాల్లో ప్రభుత్వ భవనాలు కట్టడం లేదా పేదలకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేయడం వంటివి చేస్తుంది. ఈ విధంగా చూసుకుంటే ఈ ప్రాంతంలో 47 మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందించే అవకాశం కూడా ఉంది. తెలుగుదేశం ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు ఒకపక్క ప్రభుత్వ స్థలాలను మరోపక్క రైతుల వద్ద నుండి స్థలాలు కొనుగోలుకు జిల్లా అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు సూచిస్తుంటే మండల స్థాయిలో మాత్రం ప్రభుత్వ భూములను పరిరక్షించే విషయంలో రెవెన్యూ యంత్రాంగం విఫలమైందని చెప్పవచ్చు. ఇటువంటి విలువైన భూములను స్వాధీనం చేసుకొని కంచె వేసి ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిన మండల రెవెన్యూ యంత్రాంగం మిన్నకుండిపోవడం పట్ల అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఇప్పటికైనా ఈ భూమి విషయంలో జిల్లా అధికారులు స్పందించి ఆక్రమణదారుడి నుంచి స్వాధీనం చేసుకొని ఇతరులు ఎవరూ ఆక్రమించకుండా ప్రభుత్వ భూమి రక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

మీకోసం అర్జీలకు పరిష్కారం చూపాలి

కలెక్టరు చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: మీకోసంలో అందిన అర్జీల పరిష్కారం పారదర్శకత, నాణ్యతతో ఉండాలని, ఫిర్యాదుదారులతో మాట్లాడి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు.

సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ చదలవాడ నాగరాణితో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, కె.ఆర్.ఆర్.సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పిడి డా.కెసిహెచ్ అప్పారావు, డిపిఓ ఎం.రామ్ నాథరెడ్డి జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి 234 ఫిర్యాదులను స్వీకరించినట్లు తెలిపారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలని ఆదేశించారు. అర్జీలు రీఓపెన్ కాకుండా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల ట్రిబ్యునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించండి : ఐక్యవేదిక

విశాలాంధ్ర-ఏలూరు: విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చిట్టివలస పాకలు, నెక్కలపూడి రామారావు భవన్‌లో సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న బద్దా వెంకటరావు, పంపన రవికుమార్ ,ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టమని,తాము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్ల బిగింపు నిలుపుదల చేస్తామని, జగన్మోహన్ రెడ్డి అదానీ కంపెనీతో చీకటి ఒప్పందాలు చేసుకున్నాడని ప్రచారం చేసి ఇప్పుడు అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు బిగించి వాటి ఖరీదును ప్రజల నుండి వసూలు చేస్తారని, ఏఎంఐ రిమోట్ కంట్రోల్ ద్వారా విద్యుత్తు వినియోగాన్ని నియంత్రిస్తూ ప్రజలకు అసౌకర్యాలను కల్పించడానికి అవకాశం ఉన్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రజలందరూ వ్యతిరేకించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని సంతకాలు చేసి స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక పోరాటంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో శాయన అభిలాష్ కుమార్,మంచెల్ల ఇస్సాకు,గొర్లి స్వాతి,నౌడు నెహ్రూ బాబు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు సహకరించాలి

విశాలాంధ్ర - సీతానగరం: రైతులు రీ సర్వేకు అన్ని విధాల సహకరించాలని తహశీల్దార్ ఏ శ్రీనివాస్ అన్నారు. మండలంలో రఘుదేవపురం, చినకొండేపూడి గ్రామాల్లో సోమవారం రీ సర్వే ప్రారంభం కానున్న నేపథ్యంలో తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూడవ విడత రీ సర్వేలో భాగంగా మండలంలో నాలుగు గ్రామాలు రఘుదేవపురం 4884 ఎకరాలు, చినకొండేపూడి 4500 ఎకరాలు, కాటవరం, ముల్లకల్లంకలలో రీ సర్వే ప్రారంభం కానుంది అని అన్నారు. రైతులు అందరూ తమ తమ భూముల దస్తావేజులు, పాస్ బుక్, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ పోటో, లింక్ దస్తావేజులు అన్ని ఒక కాపీ ఒకేసారి మీ గ్రామాల్లో ఉన్న రెవెన్యూ అధికారులకు ఇవ్వాల న్నారు. ఈ రీ సర్వేలో భాగంగా ముందుగా గ్రామాల సరిహద్దులు, ప్రభుత్వ భూములను గుర్తించడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గౌతమ్, వీఆర్ఓ అఖిల్, రమేష్, వెంకట్రావు, సర్వేయర్ వెంకటేష్, కార్యదర్శి టి శ్రీనివాస్, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సువర్ణవేణికి ఉత్తమ సేవా నంది అవార్డు

విశాలాంధ్ర - కడియం : హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా ఆధ్వర్యంలో, విజయవాడలో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో 2025 సంవత్సరానికి ఉత్తమ సేవా నంది అవార్డు అందుకున్నట్లు కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు బూసి సువర్ణవేణి తెలిపారు. హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ అయ్యప్ప, చైర్మన్ డైరెక్టర్ చిరంజీవి రాజా చేతులు మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర చైర్మన్ ఆర్ నాగమణి, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మక్కా జోసెఫ్, రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ ఎన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి సత్యనారా యణ, తోటి ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పేకటరాయుళ్ల అరెస్టు

విశాలాంధ్ర- తాళ్లపూడి : కోడి పందాలు, పేకటలపై తాళ్లపూడి పోలీసుల దాడులు, నిఘా పెంచారు. దీనిలో భాగంగానే వేగేశ్వర పురంలో కోడిపందాలు ఆడుతున్నారని సమాచారం మీద దాడులు చేసి నలుగురు మనుషుల ను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి ఒక కోడి, ఒక కత్తి, రూ. 1050 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తాళ్లపూడి ఎస్సై టి.రామ కృష్ణ తెలిపారు. మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో పేకాట ఆడుతు న్నారనే సమాచారం మీద దాడి చేయగా, పేకాట ఆడుతున్న ఆరుగురు మనుషులను అదుపు లోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.9 వేల 720 నగదును స్వాధీన పరుచుకుని, వారి మీద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యంగా అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం సిటీ : కూటమి ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రయోజనాలతో అభివృద్ధి పనులు చేపడుతోందని, గత వైసీపీ పాలనలో చేసినట్లుగా హడావిడిగా పనులు చేసి చేతులు దులుపు కోవడం తమ విధానం కాదని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) స్పష్టం చేశారు. సోమవారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన రూ. 32 లక్షలతో శీలం నూకరాజు కల్యాణ మండపం వద్ద రోడ్డు నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ , ముగ్గుపేట నుంచి గోరక్షణపేట, గేదెల నూకరాజు లే అవుట్, షెల్టాన్ వరకు అభివృద్ధి పనులుచేపట్టారని, ఈ మార్గంలో నిత్యం భారీ వాహనాలు తిరగడం వల్ల ఎన్నిసార్లు వేసినా కల్వర్టు, రోడ్డు కుంగిపోతోందని సీనియర్ నాయకులు చెబుతున్నారని, దీనిని పక్కాగా నిర్మించేందుకు రూ. కోటి 50 లక్షలతో నిర్మాణం చేపట్టామన్నారు. గోరక్షణపేట పైపులైన్ పనులు పక్కాగా చేపట్టామని, దురదృష్టవశాత్తు ఈ పనులు జరిగేచోట ప్రమాదంలో సోదర సమానుడైన ఒకరిని కోల్పోయామని, ఆ కుటుంబాన్ని ఆదుకున్నామని ఆయన చెప్పారు. ఐదు నెలలుగా ఈ పనులు జరుగుతున్నాయని ఎందుకింత జాప్యం అని అధికారులను అడిగితే పైపులైన్ పనులు పూర్తయినా లోపల సర్దుకుందా లేదా అనేది పరిశీలించడానికి కనీసం 45 రోజులు వేచి చూడాలని అందుకే పూడ్చి వేయకుండా ఆగామని అధికారులు చెప్పారని ఆయన వివరించారు. రోడ్లు కుంగిపోకుండా అన్ని పనులు పక్కాగా చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏపని చేసినా 50 ఏళ్ళు నిలిచేలా చేస్తుందని త్వరలో ఈ పైపులైన్ పనులు పూర్తి చేసి రోడ్డు కూడా వేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాశి నవీన్ కుమార్, వర్రే శ్రీనివాస్, మజ్జి రాంబాబు, కిలపర్తి శ్రీను, ఉప్పులూరి విశ్వనాథ్, కోకొనట్ వాసు, చెల్లుబోయిన సూర్యనారాయణ మూర్తి, శ్రీలత, కప్పల వెలుగు కుమారి, రాయి అప్పన్న బాబు, దాస్యం ప్రసాద్, సలాది ఆనంద్, ఆదారి లక్ష్మీ నారాయణ, రఫీక్ రాజా, వై దేవి ప్రసాద్, శ్రీనివాస్, శివారెడ్డి, చాపల చిన్న రాజు, వానపల్లి శ్రీనివాస్, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ధనంజయుడుకు ఎమ్మెల్యే మద్దిపాటి పరామర్శ

విశాలాంధ్ర-దేవరపల్లి: ప్రముఖ వ్యాపారవేత టీడీపీ నాయకులు దుద్దుకూరు గ్రామానికి చెందిన కరుటూరి ధనంజయుడును సోమవారం గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు దేశం నేతలు పరామర్శిం చారు. ధనుంజయుడు తండ్రి దుద్దుకూరు మాజీ సర్పంచ్ కటటూరి సూర్యారావు ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజులు కరుటూరి శ్రీరామ్మూర్తిని కరటూరి ధనుంజయుడును పరామర్శించారు ఈ సందర్భంగా స్వర్గీయ కరుటూరి సూర్యారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్, టీడీపీ నాయకులు ముళ్ళపూడి దొరాజీ చౌదరి, గన్నమని హరికృష్ణ, పెనుమత్స సుబ్బరాజు, రొంగల సత్యనారాయణ, ఉప్పులూరి రామారావు, కాకర్ల రామ తులసి, బల్ల సూర్యచక్రం, జమ్ముల సతీష్, బలుసు సత్యనారాయణ, గన్ని గోపాల్, ఆచంట చిన్న శేషారావు, కొయ్యలమూడి తాతారావు, బిక్కిన నాగరాజు, నున్న చిన్ని, పసుమర్తి రతీష్ , బాదంపూడి, ముళ్ళపూడి సత్యనారాయణ, కూచిపూడి చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కరుటూరి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రైతులకు సాగునీటి ఇబ్బంది రానివ్వం :ఎమ్మెల్యే ముప్పిడి

విశాలాంధ్ర-తాళ్లపూడి : తాళ్లపూడి మండలంలోని పైడిమెట్ట ఎత్తి పోతల పథకం పంప్ హౌస్ వద్ద గల ట్రాన్స్ఫార్మ్ వద్ద రాత్రి సమయంలో హఠాత్తుగా మంటలు పుట్టి కాలి పోయింది. సమాచారం తెలుసుకున్న పోలీస్, అగ్నిమాపక సిబ్బంది, ఎత్తి పోతల పథకం అధ్యక్షులు రామచంద్రం ఘటన ప్రదేశం వద్దకు వచ్చారు. కాలి పోయిన 750 కిలో వాట్స్ ట్రాన్స్ఫార్మర్ ను రెండు సంవత్సరాల క్రితం రిపేర్ చేయించారని గ్యారెంటీ అయిందన్నారు. రైతుల సాగు నీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని, కాలి పోయిన ట్రాన్స్ఫార్మర్ స్థానే కొత్తది వచ్చేలా చర్యలు తీసుకుంటామని కొవ్వూరు శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తాళ్లపూడి మండలంలోని పైడిమెట్ట ఎత్తి పోతల పథకం పంప్ హౌస్ వద్ద గల 750 కె.వి.ఏ కెపాసిటీ గల ట్రాన్స్ఫార్మర్ అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా కాలి పోయిన నేపథ్యం లో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి ఎత్తిపోతల వద్దకు విచ్చేసారు. ఈ ప్రాంతంలో ఎత్తి పోతల అవసరాల అభివృద్ధి సిఎం దృష్టిలో పెట్టామని ఎమ్మెల్యే అన్నారు. ఆయనతో పాటు ఏఎంసి నాదెళ్ల శ్రీ రాం, మలకపల్లి సొసైటీ అధ్యక్షులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మండల టీడీపీ అధ్యక్షులు నామన పరమేశ్వరరావు, పైడిమెట్ట ఎత్తి పోతల పథకం అధ్యక్షులు ముళ్ళపూడి రామ చంద్రం, గన్నిన సత్తిబాబు, సిద్ద దుర్గారావు, యువగళం నాయకులు కూచిపూడి గణపతి, మాజీ ఎంపీపీ కోటీనీస్, కాకర్ల వంశీ, జనసేన మండల అధ్యక్షులు గంటా శివ రామ కృష్ణ, నామా నరేంద్ర, మండల తహశీల్దార్ లక్ష్మీ లావణ్య, ఎలక్ట్రికల్ ఏ.ఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం సిటీ : మనిషి ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అడిషనల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం కోటగుమ్మం, పుష్కర్ ఘాట్ పరిసర ప్రాంతాలలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో వ్యాపారుల వద్ద ప్లాస్టిక్ వాడకాన్ని పరిశీలించడమే కాకుండా, ప్రత్యామ్నాయంగా వాడవలసిన పర్యావరణహిత బ్యాగులపై స్పష్టమైన సూచనలిచ్చారు. ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ బారిన పడే అవకాశం ముందని.. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల భూమి, నీరు, గాలి కలుషితం అవుతున్నాయన్నారు. కనుక ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించాలని.. ప్రత్యామ్నాయంగా వస్త్ర, జూట్ సంచులు వాడాలని సూచించారు. అనంతరం ఆ ప్రాంతంలో శానిటేషన్ పనులను పరిశీలించారు. పుష్కర్ ఘాట్ వద్ద ఫుట్ పాత్ ల మరమ్మతుల కారణంగా ఏర్పడిన డెబ్రిస్ ను తక్షణమే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరా దన్నారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

పటిక బెల్లంతో తులాభారం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి బాల దుర్గమ్మ ఆలయంలో తులాభార కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. చాగల్లు మండలం ఊనగట్ల గ్రామానికి చెందిన తణుకు హనుమాన్ కుమార్ భాగ్యలక్ష్మి దంపతుల కుమార్తె జాహ్నవికి పటిక బెల్లంతో తులాభారం నిర్వహించారు, అంతకుముందు బాలదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారా యణ కోశాధికారి కామిశెట్టి దుర్గారావు, కమిటీ సభ్యులు కామిశెట్టి మంగ, గారపాటి అప్పారావు , మాతు సీత కామిశెట్టి ధర్మరాజు పిన్నమనే వెంకటకృష్ణ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత పాలకులదే : మేడా

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం సిటీ : అన్నపూర్ణ వంటి ఆంధ్రప్రదేశ్‌లో దొంగలే పాలకులుగా శాసిస్తున్నారని, ఉజ్వల భవిష్యత్, అపార ఖనిజ వనరులు గల ఆంధ్ర రాష్ట్రం నేడు అప్పుల రాష్ట్రంగా మారిందని, దీనికి నేటి రాజకీయ నేతలే ప్రధాన కారణమని ఆర్పీసీ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్పిసి) ప్రజా కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నేటి పాలకులు రుణాలు ఎందుకు చేస్తున్నారో అర్థం కావటం లేదని, రుణానికి తగిన కనీస అభివృద్ధి సగటు ఆంధ్రుడు పొందలేకపోతున్నాడని విమర్శిం చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తమ పాలకులు కరువయ్యారని, అసమర్థ పార్లమెంటేరియన్ల వల్ల మన ఎంపిల అసమర్థత, అవినీతి ఖండాంతరాలు వ్యాపిస్తుందని , దేశ వ్యాప్తంగా ఆంధ్రుల ప్రతిష్ట ను బజారున పడుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆనాడు ఉవ్వెత్తున ఉద్భవించిం చిన జై ఆంధ్ర ఉద్యమ స్ఫూర్తి మన ఆంధ్రుల్లో వికసించాలని, అప్పుడే ఆంధ్రప్రదేశ్ కు భవిష్యత్ , ప్రగతి ఏర్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు. నరేంద్ర మోదీ సర్కార్‌ను ప్రశ్నించి ప్రత్యేక హోదా , విభజన హామీలతో బాటుగా ఆంధ్ర రాష్ట్రానికి కేంద్రం నుండి రావాల్సిన అన్ని హామీలను సాధించిన నాడే మన రాష్ట్రానికి అద్భుతమైన భవిష్యత్ ఉంటుందని, రాష్ట్ర అభివృద్ధిని సొంత ప్రయోజనాలకు మన పార్లమెంట్ సభ్యులు దారి మళ్ళించుకుంటున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే విప్లవాత్మక చైతన్యం, తిరుగుబాటు యావత్ భారతదేశంలో ఒక మంచి మార్పుకు నాంది కాబోతుందని, మేడా శ్రీనివాస్ నేటి తరం యువతీ యువకులకు భరోసా ఇచ్చారు. సభకు ఆర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు.

క్రీడాలతో మానసిక వికాసం

విశాలాంధ్ర - రాజానగరం : మానసిక, శారీరక ఉల్లాసం క్రీడలు దోహద పడతాయని, తద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ అన్నారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆదికవి నన్నయ వర్సిటీవిద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను సోమ వారం ప్రారంభించారు. దీనిలో భాగంగా వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కె.వి స్వామి బౌలింగ్ చేయగా విసి ప్రసన్నశ్రీ బ్యాటింగ్ చేస్తూ అందరర్నికట్టుకున్నారు. వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా నన్నయ వర్సిటీ విద్యార్థులకు క్రికెట్, కోకో, వాలీబాల్, త్రోబాల్, అథ్లెటిక్స్ వంటి వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. భారత స్వతంత్ర స్ఫూర్తిని స్మరించుకోవాలనే ఉద్దేశంతో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ఈ పోటీలలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. దేశంలో ఎక్కువ మంది క్రికెట్ అభిమానులు ఉన్నారని, క్రికెట్ ఒక స్ఫూర్తిదాయకమైన క్రీడా అని కొనియాడారు. క్రికెట్ మెన్ పోటీలకు వర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ కళాశాలలో నుండి 12 టీమ్స్ రావడం విశేషమన్నారు. క్రికెట్ పోటీ నిర్వాహకులు వి.సాల్మన్ దేవానంద్,డాక్టర్ వివిఎంయం ఫణీంద్ర, పీడీలు డాక్టర్ ఎంవిఎస్ఎస్. మూర్తి, డాక్టర్. కె.బాల సత్యనారాయణ, సిహెచ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ కుట్ర పూరితం

విశాలాంధ్ర - కడియం : వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా అరెస్టు చేసిందని వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల విష్ణు చక్రవర్తి ఆరోపించారు. ఎన్నికల హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం, ప్రజల తరపున సంక్షేమ పథకాల కోసం ప్రశ్నిస్తున్న వైసీపీ నాయకులను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్ట్ చేసిందని, త్వరలోనే అన్ని విషయాలు బయటకు వస్తాయని, మిథున్‌రెడ్డి ఎటువంటి కేసులు లేకుండా బయటకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన సదుపాయాలను మిథున్ రెడ్డికి కల్పించకుండా కోర్టును దిక్కరించిందని ఆక్షేపించారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని, త్వరలోనే కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించండి

విశాలాంధ్ర - గోపాలపురం : రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా జాతీయ రహదారుల విస్తరణకు ప్రజలు సహకరించాలని ఆర్ అండ్ బి అధికారులు ప్రజలను కోరారు. సోమవారం మండలంలోని దొండపూడి గ్రామంలో నేషనల్ హైవే 365 బీబీ విస్తరణ పనులను వారు పరిశీలన చేసి మార్కింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హైవే ఆర్ అండ్ అధికారులు స్థానిక ప్రజలతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రహదారులను విస్తరించే పనిలో ప్రభుత్వం ఉందని అందుకు ప్రజలు సహకరిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించాలి : చెల్లుబోయిన

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం సిటీ : రాష్ట్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా తీర్చి దిద్దుతానని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసలు విషయాల మీద దృష్టి సారించడం లేదని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పద్నాలుగు నెలలు పూర్తయినా, ప్రజలకు అందించాల్సిన సంక్షేమం, తోడ్పాటునందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమాన్ని చూడాల్సిన కూటమి ప్రభుత్వం , ప్రతి పక్షాల మీద బురద చల్లుతూ, విషయాన్ని పక్క దోవ పట్టించడానికి కృషి చేస్తుందన్నారు. ఈ క్రమంలోనే ఇతర సమస్యలతో పాటు రాష్ట్రంలో ఉన్న హాస్టళ్ళను పట్టించుకోవడం మానేశారన్నారు. హాస్టళ్ళలో విద్యార్థులు ఎలాంటి సమస్యలతో బాధపడుతున్నారు, వారికి సరైన పోషకాహారం అందుతుందా, వారికి పరిశుభ్ర వాతావరణంలో గదులు, మరుగుదొడ్ల సదుపాయాన్ని కల్పిస్తున్నారా లేదా అని పట్టించుకున్న నాధుడే లేడన్నారు. ఇటీవల స్వయంగా రాష్ట్ర హోం మంత్రి ఒక హాస్టల్ ను సందర్శించి అక్కడ పరిస్థితులు అనుకూలంగా లేవని, అక్కడి నాణ్యమైన బియ్యాన్ని వాడడం లేదని చెప్పినా ఉలుకూ పలుకూ లేదన్నారు. ఎంత సేపూ అమరావతి, ఏఐ, క్వాంటమ్ వ్యాలీ కథలు తప్ప ఈ రాష్ట్రంలో ప్రజలు పడుతున్న బాధలు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా డైవర్షన్ పాలిటిక్స్ మానుకోవాలన్నారు. ఇటీవల రూరల్ ఎమ్మెల్యే బుచ్చియ్య చౌదరి తమ నాయకులపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతు న్నారని, బుచ్చియ్య చౌదరి ఏదో ఆశతోనే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని అర్థమవుతుందన్నారు. కక్ష పూరిత రాజకీయాల కోసం ఏ మాత్రం సంబంధంలేని వారిని కేసుల్లో ఇరికిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వాన్ని తలచుకుంటే మోసం గుర్తుకొస్తుందని, పద్నాలుగు నెలల్లో లక్షా 80 వేల కోట్లు అప్పులు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేత గూడూరి శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.

ప్రజలకు సేవలు అందించాలి : గన్ని

విశాలాంధ్ర - రాజానగరం : బ్యాంకు వచ్చే ఖాతాదారులు,ప్రజలకు ఉన్నతమైన సేవలు అందించి అందరి మన్ననలు పొందాలని జిఎస్ఎల్ విద్యా సంస్థలు అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు అన్నారు. మండలంలోని దివాన్ చెరువు గ్రామంలో నూతనంగా ప్రారంభించిన సి.ఎస్.బి(కాథలిక్ సిరియన్ బ్యాంక్ లిమిటెడ్) 27వశాఖ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిఎస్ఎల్ విద్యా సంస్థలు అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు, జిఎస్ఎల్ విద్యా సంస్థలు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్, నిడదవోలు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బత్తుల నాగేశ్వరరావు(నాగు), తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు, విజయ భారతి చెస్ట్ హాస్పిటల్ అధినేత డాక్టర్ గూడూరి శ్రీనివాస్, దివాన్ చెరువులోని శారద నర్సింగ్ హోం హాస్పిటల్ అధినేత ప్రముఖ వైద్యులు డాక్టర్ కేవీఆర్ సుబ్రమణ్యం (రాంబాబు)తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. గన్ని భాస్కరరావు బ్యాంకు ప్రధాన ద్వారాన్ని ప్రారంభించగా, గన్ని సందీప్ బ్యాంకు డైరెక్టర్ రూమ్ ప్రారంభించారు, బత్తుల నాగు బ్యాంక్ మేనేజర్ ఛాంబర్ ప్రారంభించగా, కందుల బాబు రాయుడు ఏటీఎం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ ఖాతాదారుల నమ్మకాన్ని గెలుచుకోవాలని, ప్రతి ఒక్కరికి మెరుగైన బ్యాంకు సేవలు అందించాలని కోరారు. ఇతర బ్యాంకులకు సిఎస్బి బ్యాంకుకు గల వ్యత్యాసాలను అడిగి తెలుసు కున్నారు. రాజమహేంద్రవరం క్లస్టర్ హెడ్ షేక్ రాజా, దివాన్ చెరువు శాఖ బ్రాంచ్ మేనేజర్ కసిలంక అరుణ్ కుమార్ మాట్లాడుతూ వంద ఏళ్ల చరిత్ర కలిగిన తమ బ్యాంకు మొట్టమొదటిగా కేరళ రాష్ట్రంలోని త్రిస్సూర్ నందు 1920లో ప్రారంభించారన్నారు. రాజమండ్రి డివిజన్ పరిధిలో ఇప్పటికే ప్రతి పది కిలోమీటర్లకు దూరంలో 26 శాఖలు ఉండగా ప్రస్తుతం దివాన్ చెరువు గ్రామంలో 27వ శాఖ ప్రారంభించినట్లు చెప్పారు. గ్రామాల్లోని రైతులకు, చిరు వ్యాపారులకు మెరుగైన సేవలందించడమే తమ లక్ష్యమన్నారు. డిపాజిట్లు, బ్యాంకు రుణాలు, గృహ రుణాలు, బంగారు రుణాలను ఇతర బ్యాంకులతో పోల్చి చూస్తే వేగంగా అందిస్తామన్నారు. జాతీయ బ్యాంకులు వలె వడ్డీ రేట్లు తక్కువ స్థాయిలో ఉంటాయన్నారు. ప్రతి ఇంటి ఇంటికి తమ బ్యాంకు ఖాతా ప్రారంభించాలనే ఉద్దేశ్యంతో దివాన్ చెరువు గ్రామంలో బ్యాంకు ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం అతిథులకు శాలువాలు కప్పి మొక్కలను బహుకరించారు. ప్రధాన శాఖ మేనేజర్ ఉల్లి సతీష్ కుమార్,ఎంపీపీ మండారపు సీతారత్నం వీర్రాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వంక మల్లిఖార్జున స్వామి(మల్లిబాబు), టిఎన్టియుసి జిల్లా అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల నేతలు దేశాల శ్రీను,యర్రంశెట్టి శ్రీను,గంగిశెట్టి సోమేశ్వ రరావు, నరుకుల అర్జునరావు, వర్తక సంఘం అధ్యక్షులు వీరపండు,ఆర్యవైశ్య సంఘం నాయకులు గ్రంధి నానబ్బులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర - కాకినాడ : పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలి జిల్లా ఎస్పీ. సోమవారం పీజీఆర్ఎస్‌కు 65 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను జిల్లా ఎస్పీకి స్వయంగా తెలియచేసుకున్నారు. ప్రజల నుంచి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించవలసిందిగా ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాల లోను, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చునని, ఆ ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి, సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

మహేష్ కేసులో నిందితుడిని అరెస్టు చేయాలి

విశాలాంధ్ర - అమలాపురం : దోనిపాటి మహేష్ కేసులో ఇప్పటి వరకు ఐదుగురు నిందితులు అరెస్ట్ కాగా ప్రధాన నిందుతుడు అమలాపురం రాయల్ కాలేజీ ప్రిన్సిపాల్ గుత్తుల విజయ కుమార్‌ను తక్షణం అరెస్ట్ చెయ్యాలని అమలాపురం డిఎస్పీను కోరినట్లు వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ తెలిపారు. సోమవారం అమలాపురం డిఎస్పీ టిఎస్ఆర్‌కే ప్రసాద్‌ని కలిసిన అమలాపురం దళిత సంఘ నేతలు సిపిఎం జిల్లా అధ్యక్షుడు కారెం వెంకటేశ్వరావు, మాల మహానాడు నాయకుడు గిడ్డ వెంకటేశ్వరావు, సీబిటీయా జిల్లా కార్యదర్శి జి దుర్గారావు, కేవీపీస్ జిల్లా కార్యదర్శి శెట్టిబత్తుల తులసి, సాపే రమేష్, తక్షణం ప్రధాన ముద్దాయి గుత్తుల విజయ కుమార్‌ను అరెస్ట్ చెయ్యాలని, బాధితుడు దోనిపాటి మహేష్‌కి న్యాయం చెయ్యాలని డిమాండ్ చేసారు. ప్రధాన నిందితుడు గుత్తుల విజయ కుమార్ గతంలో డబ్బులు తీసుకున్న మాట వాస్తవమే అని వాటిని తిరిగి ఇచ్చేసాడని ఇంకా కొంత డబ్బు తిరిగి ఇవ్వవలసి ఉందని డిఎస్పీ తెలిపారు. అమలాపురం రాయల్ కాలేజీ ప్రిన్సిపాల్ గుత్తుల విజయ కుమార్ కొంత డబ్బు తిరిగి ఇచ్చినప్పటికీ ఉద్యోగాలు ఇప్పిస్తాను అని చాలామంది నుండి డబ్బులు వసూళ్లు చేసిన ముఠాకి ప్రధాన ముద్దాయిగా గుత్తుల విజయ కుమార్ పరిగణించాలని అతని నిర్వాకం వల్లే దోనిపాటి మహేష్ పై హత్య ప్రయత్నం జరిగిందని కనుక అమలాపురం రాయల్ కాలేజీ ప్రిన్సిపాల్ గుత్తుల విజయ కుమార్‌ను ఈ కేసులో ప్రధాన నిందితుడిగా చేర్చాలని డిఎస్పిని డిమాండ్ చేశారు. పోలీసులు అమలాపురం రాయల్ కాలేజీ ప్రిన్సిపాల్ గుత్తుల విజయ కుమార్‌ను ప్రధాన నిందితుడిగా ఈ కేసులో రాజకీయ వొత్తుడులకు లొంగి చేర్చని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాకి పిలుపు నిస్తామని వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ తెలిపారు.

స్మార్ట్ కిచెన్‌ను రోల్ మోడల్‌గా తీసుకోండి

విశాలాంధ్ర - అమలాపురం : కడప ప్రభుత్వ బడుల్లో పిల్లలు కోసం పవన్ కళ్యాణ్ నిర్మించిన స్మార్ట్ కిచెన్ రోల్ మోడల్‌గా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం బడి పిల్లలకు ఆహారం అందించాలనీ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సీనియర్ సిటిజన్ ఫోరం చైర్మన్ కే సత్తిబాబు కోరారు. రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తమ ట్రస్ట్ నుండి పూర్తి ఆర్థిక సహాయం అందించి డొక్కా సీతమ్మ పేరిట ఏర్పాటు చేసిన స్మార్ట్ కిచెన్ లా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించి బడి పిల్లలకు పరిశుభ్ర మైన రుచికరమైన ఆరోగ్యకర మైన భోజనం అందించాలని ఎక్స్పరిమెంటల్ బేస్‌గా అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలు చేసి చూసి రాష్ట్ర వ్యాప్తంగా ముందుకు తీసుకువెళ్లాలని తద్వారా భావి భారత పౌరులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడానికి ఉప ముఖ్యమంత్రి కడపలో ఏర్పాటు చేసిన స్మార్ట్ కిచెన్ నిర్మాణాన్ని సందర్శించే స్టడీ చేసి ముందు పోవాలని సీనియర్ సిటిజన్స్ ఫోరం చైర్మన్ కామ్రేడ్ కే సత్తిబాబు ప్రభుత్వాన్ని కోరారు.

పీజీఆర్ఎస్‌కు అర్జీలు

విశాలాంధ్ర - గండేపల్లి : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రెండు అర్జీలు అందినట్లు ఎంపీడీవో కే చంద్రరావు తెలిపారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం నందు ఎంపీడీవో కే చంద్రరావు, ఎమ్మార్వో ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఓ ఐఎన్, శ్రీనివాసు, మండల విద్యాశాఖ అధికారి కె హన్య నాయక్, మండల వ్యవసాయ అధికారి బి శ్రీరామ్, పశు సంవర్ధక శాఖ అధికారి పి శ్రీనివాస్, ఏపిఎం, డిఆర్‌డిపి పి సన్యాసిరావు, ఏపిఓ ఎంజిఎన్ఆర్ ఈజిఎస్ ఎం రామకృష్ణం రాజు, సూపర్వైజర్ ఐసిడిఎస్ ఎ నాగ పార్వతి హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్స్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులు ప్రకృతి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల డీన్ డా రవి తంగంజ, అసిస్టెంట్ డీన్ డా బి సౌజన్య మరియు ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ బి కామేశ్వర శర్మ ప్రారంభించారు. డీన్, అసిస్టెంట్ డీన్ మాట్లాడుతూ "ప్రకృతిని కాపాడటం మనందరి బాధ్యత. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడమే కాక, భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన జీవన వాతావరణాన్ని అందించవచ్చున్నారు. విద్యార్థులు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను తీసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, నాన్-టీచింగ్ సిబ్బంది, స్థానిక నాయకులు కూడా పాల్గొన్నారు.

ప్రకటన

కొత్తపల్లి సుబ్బారావు

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన, డోర్ నెంబర్ 4-93, తిమ్మాపురం నివాసులైన **కొత్తపల్లి సుజాత, తండ్రి సుబ్బారావు** వ్రాయించి ఇచ్చిన ప్రకటన.

నా తండ్రి **కొత్తపల్లి సుబ్బారావు, తండ్రి వెంకన్న** డోర్ నెంబర్ 4-93, తిమ్మాపురం,, కాట్రేనికోన, కాట్రేనికోన మండలంలో మా ఇంటి వద్ద **ది.14-06-2025**న మరణించాడు. వీరి మరణం ప్రభుత్వ రికార్డులలో నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల **10 రోజులలో** తెలియజేయగలరు.

కొత్తపల్లి సుజాత, తండ్రి సుబ్బారావు
డోర్ నెంబర్ 4-93, , తిమ్మాపురం,
కాట్రేనికోన గ్రామం, కాట్రేనికోన మండలం,
అంబేద్కర్ కోనసీమ జిల్లా. సెల్: **7989394105**

ప్రకటన


కొత్తపల్లి సీతమ్మ

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన గ్రామం, డోర్ నెంబర్ 4-93, తిమ్మాపురం నివాసులైన **కొత్తపల్లి సుజాత, తండ్రి సుబ్బారావు** వ్రాయించి ఇచ్చిన ప్రకటన.

నా తల్లి గారైన **కొత్తపల్లి సీతమ్మ భర్త సుబ్బారావు** డోర్ నెంబర్ 4-93, తిమ్మాపురం, కాట్రేనికోన గ్రామం, కాట్రేనికోన మండలంలో మా ఇంటి వద్ద **ది.14-06-2025**న మరణించారు. వీరి మరణం ప్రభుత్వ రికార్డులలో నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల **10 రోజులలో తెలియజేయగలరు.**

కొత్తపల్లి సుజాత, తండ్రి సుబ్బారావు
డోర్ నెంబర్ 4-93, , తిమ్మాపురం,
కాట్రేనికోన గ్రామం, కాట్రేనికోన మండలం,
అంబేద్కర్ కోనసీమ జిల్లా. సెల్: **7989394105**

వృద్ధుల పోషణ -సంక్షేమ చట్టం అమలు చేయండి

విశాలాంధ్ర - అమలాపురం : తల్లిదండ్రుల వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007 సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన పీజీఆర్ఎస్‌లో మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయ కుటుంబ వ్యవస్థలో పూర్వం పెద్దలే నిర్ణయాత్మక శక్తులుగా ఉండి నిర్ణయాలు తీసుకునే వారిని ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై చిన్నచిన్న కుటుంబాలుగా మారడం తరువాత తరాలకు పెద్దవారితో సాన్నిహిత్యం లోపించడంతో పిల్లలకు పెద్దల ప్రాధాన్యత ఏమిటో తెలియకపోవడంతో చాలామంది వృద్ధులు తమ పిల్లల నిరాధారణకు, నిర్లక్ష్యానికి గురై ఆర్థిక ఇబ్బందులతో ఒంటరితనంతో ఎన్నో అవమానాలను భరిస్తూ తమ అవసరాలను తీర్చుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. వీరిలో కొందరు జీవిత భాగస్వామిని కోల్పోయిన వారు పిల్లలు లేని పరిస్థితి ఇలా రకరకాలుగా కన్న తల్లి దండ్రుల ఆదరణకు నోచు కోకుండా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఈ సంక్షేమ చట్టం పెద్దల హక్కులను చట్టప్రకారం కాపాడుతుందన్నారు. భారత పౌరులందరికీ రాజ్యాంగం కల్పించిన కొన్ని ప్రాథమిక హక్కులు ఉన్నాయని అందుకు వయోవృద్ధులు మినహాయింపు కాదన్నారు. వికలాంగులు, సీనియర్ సిటిజెన్ల సంక్షేమ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లా అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించి

ఈ యొక్క చట్టం గురించి తెలియజేయాల్సి ఉందన్నారు. 60 సంవత్సరాలు దాటిన వారి భద్రత కోసం ఈ చట్టం రూపొందించబడిందన్నారు. ఆస్తి సంపాదనలేని వృద్ధులు రక్షణ కల్పించడానికి డివిజన్ జిల్లా స్థాయిలలో అప్పిలేట్ ట్రిబ్యునల్ కమిటీలను నియమించాలని ఆదేశించిందన్నారు. సెక్షన్ 19 ప్రకారం ప్రతి జిల్లాకు ఒక వృద్ధాశ్రమాన్ని ప్రభుత్వ పరంగా నెలకొల్పాలని ఈ వృద్ధాశ్రమంలో కనీసం 150 మంది వృద్ధులు అనాథలు పిల్లలు నిరాదరణ గురైన తల్లిదండ్రులు ఉండేలా చూసుకోవాల న్నారు. ముఖ్యంగా 60 ఏళ్ల పైబడిన వృద్ధులు తల్లిదండ్రుల సంరక్షణ, పిల్లలు లేదా వారసులు తల్లిదండ్రుల పట్ల ఆర్థిక సంరక్షణ సహాయం ఇవ్వకపోతే, తల్లి/తండ్రి సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ వద్ద ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ప్రతి జిల్లా డివిజన్ మండలంలో ప్రభుత్వం మెయింటెనెన్స్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తుందన్నారు. దీని ద్వారా నెలవారీగా సంరక్షణ ఖర్చు రూ.10,000 వరకు చెల్లిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు సీనియర్ సిటిజనుల సంక్షేమ అధికారి శ్రీనివాసు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్మీ నియామక ర్యాలీ, హాకీ టోర్నీ ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ క్రీడా మైదానం వేదికగా ఆగస్టు 3 నుంచి 20 వరకు ఆర్మీ నియామక ర్యాలీ, 01 నుంచి 12 వరకు జాతీయ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్ షిప్ పోటీల ఏర్పాట్లను సోమవారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పరిశీలించారు. రెవెన్యూ, ఆర్మీ, కాకినాడ నగరపాలక సంస్థ, క్రీడా అభివృద్ధి, హాకీ ఆంధ్రప్రదేశ్ అధికారులతో ఏర్పాట్లపై జేసీ చర్చించారు. జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ..కాకినాడ జిల్లా అధికార యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ రెండు కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు పారిశుధ్యం, క్రీడాకారులు వసతి, భోజనం ఇతర సదుపాయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలన్నారు. ఈ నెల 30 నాటికి ఏర్పాట్లు పూర్తి చేసేలా అధికారులు కృషి

చేయాలని జేసీ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో జేసీ వెంట డీఆర్వో వెంకటరావు, ఆర్డీవో ఎస్ మల్లిబాబు, కాకినాడ నగర పాలక సంస్థ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్ఓ డా పృథ్వీచరణ్, డీఎస్డీవో బి శ్రీనివాస కుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ సీహెచ్ బాబురావు, ఆర్మీ అధికారులు, హాకీ ఆంధ్ర ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పీ-4తో పేదరిక నిర్మూలన : ఎమ్మెల్యే పంతం

విశాలాంధ్ర - కరప : పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలనను చేపట్టాలని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు ముం దుకు రావాలని కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ పేర్కొన్నారు. స్థానిక కరప చంద్రన్న సమావేశ మందిరం నందు సోమవారం పీ4 సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నానాజీ ప్రజా భాగస్వామ్యంతో పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారిని పైకి తీసుకొచ్చేందుకు అందరం కృషి చేద్దామని తెలిపారు. పేదవారికి విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పన, ఉపాధి వంటి అవసరాలను, అవకాశాలను తీర్చడమే లక్ష్యంగా పి4 విధానం ఎంతగానో ఉప యోగపడుతుందని. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నానాజీ తెలిపారు. ఉపాధ్యా యుల ఉద్యోగుల నుంచి 60 కుటుంబాలను దత్తత తీసుకున్నామని ఎంఈఓ బుల్లి కృష్ణవేణి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, మాజీ జెడ్పిటిసి నులుకుర్తి వెంకటేశ్వరరావు, పెంకె శ్రీనివాస్ బాబా, ఏఎంసీ చైర్మన్ ముద్రగడ రమేష్, సొసైటీ ప్రెసిడెంట్లు ఎస్ భవాని శంకర్, రెడ్డిపల్లి నారాయణ రావు, దూడల నారాయుడు, వెలుగుబంట్ల సూరిబాబు, వీరన్న, బందారు మురళీ, కొండబాబు, గంగాధర్, కోటగిరి మహేంద్రబాబు, తుమ్మలపల్లి గోవిందరాజులు, మామిడాల వెంకటేష్, వై పండు, పంచాయతీ కార్యదర్శిలు సచివాలయం సిబ్బంది వివిధ గ్రామాల జనసైనికులు పాల్గొన్నారు.

ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం

విశాలాంధ్ర - మామిడికుదురు : ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవ పురస్కరించుకుని మామిడికుదురు దీప్తి పాఠశాల విద్యార్థులు మొక్కలు నాటుతూ సేవ్ నేచర్ సేవ్ ఎర్త్ అంటూ నినాదాలు పలికారు. ప్రకృతిని కాపాడుకోవడం మనధర్మం అని, ఎటువంటి కలుషితాలు లేకుండా మన ముందు తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందివ్వాలని కరస్పాండెంట్ డివివి సత్యనారాయణ విద్యార్థులతో చెప్పారు. ప్రధానోపాధ్యాయులు యక్కలదేవర నాగసుబ్బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మురళిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

విశాలాంధ్ర - కరప : కరప మండలం పెనుగుదురు గ్రామానికి చెందిన పులపకూర సునీత అదే గ్రామానికి చెందిన మురళి మానసికంగా వేధిస్తూ కులం పేరుతో దూషించడం జరిగిందని దీనిపై కేసు నమోదు చేసిన ఆ కేసు కొట్టి వేయడం జరిగిందని పోలీసులు తెలపడంతో సునీత సోమవారం జిల్లా ఎస్పీకి మురళిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేసుకోవడం జరిగింది. పెనుగుదురు ఫీల్డ్ అసిస్టెంట్‌గా ప్రస్తుతం సునీత పనిచేస్తున్నారు. పోలీసులు తన పట్ల చిన్నచూపు చూస్తున్నారని సునీత విలేకరులకు తెలిపారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా, డీఆర్వో వెంకటరావులతో కలిసి రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ..స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ప్లాస్టిక్‌ను నిషేధించిన నేపథ్యంలో రూ.1.60 లక్షల వ్యయంతో వెయ్యి లీటర్ల సామర్థ్యం గల ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ప్రాముఖ్యంగా కలెక్టరేట్ అధికారులు, సిబ్బందికి, ప్రతి వారం పీజీఆర్ఎస్‌కి వచ్చే అర్జీదారులకు ఈ ప్లాంట్ ద్వారా తాగునీరు సదుపాయం కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ ఎస్ రామ్మోహన్, ఎంపన్ శివా ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు తల్లికి వందనం

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : దారిద్ర రేఖకు దిగువన ఉండి బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి 15 వేల చొప్పున అందిస్తుందని సచివాలయ కార్యదర్శి శివకుమార్ పేర్కొన్నారు. రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఒకటి నుండి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఈ పథకం కింద ఆర్థిక సహాయం లభిస్తుందన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగి 300 యూనిట్లు లోపు విద్యుత్తును వినియోగించే వారు ఈ పథకానికి అర్హులన్నారు. 75 శాతం హాజరు ఉండాలన్నారు. ఆదాయ పన్ను చెల్లించరాదని, నాలుగు చక్రాల వాహనాలు ఉండరాదన్నారు. సంపూర్ణ అక్షరాస్యత దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నందున బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పాలని శివకుమార్ తెలిపారు. మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో శివకుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంతోషి, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, డాక్టర్ శిరీష, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చండి

విశాలాంధ్ర - పిఠాపురం : డిప్యూటీ సియం, పిఠాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీలు నెరవేర్చి పిఠాపురం అభివృద్ధికి బాటలు వేయాలని మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు, కార్యదర్శి కొండేపూడి శంకర్రావు, అన్నవరపు నగేష్ పాదా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పిఠాపురం పురపాలక సంఘంలో సుమారు లక్ష మంది జనాభా ఉంటారు. కానీ శానిటేషన్ వర్కర్స్ మాత్రం 72 మంది మాత్రమే ఉన్నారు. వర్కర్స్‌నీ పెంచి శానిటేషన్ మెరుగుపర్చమని, ట్రాఫిక్ నియంత్రణ చేయాలని, మెయిన్ రోడ్డు వెడల్పు చేయాలని మరియు ఉప్పాడ రైలే బ్రిడ్జి త్వరితగతిన పూర్తి చేయాలని విన్నవిస్తూ పాదా ఆఫీసులో ఫిర్యాదు చేశారు.

స్మార్ట్ మీటర్లు వద్దు.. సాధారణ మీటర్లే ముద్దు

సీపీఐ సంతకాల సేకరణ

విశాలాంధ్ర ఏలూరు: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఉద్యమించాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోలిమే బాల యేసులు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేయడానికి ఆదానీ స్మార్ట్ మీటర్లు తీసుకువచ్చారని, ప్రజలందరూ వాటిని తిరస్కరించాలన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ. జనసేన పార్టీలు ఈ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించారని ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారని గుర్తు చేస్తూ, అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థ, ప్రజల సంపద అయిన విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి మొదటిగా ఈ స్మార్ట్ మీటర్లు తీసుకువచ్చి సాయంత్రం 6 నుంచి రాత్రి 10 వరకు విద్యుత్ వాడకం ఎక్కువగా ఉంటుంది కనుక ఆ సమయానికి ఎక్కువ రేటు పెంచే విధంగా ఆ మీటర్లు తయారు చేశారని, అదేవిధంగా ఇప్పటివరకు మనం కడుతున్న బిల్లు కొద్దిగా ఆలస్యమైన 15 రోజుల గడువులో కట్టుకునే వారమని, కానీ ఈ స్మార్ట్ మీటర్ల వలన వెంటనే విద్యుత్ కట్ అయిపోతుందని, ఇది దుర్మార్గమైన చర్యని విమర్శించారు. ప్రజలకు సేవారంగం ద్వారా అందించవలసిన విద్యుత్తును వ్యాపార దృక్పథంతో ప్రజలపై చేస్తున్న దాడి అని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఇటువంటి దుర్మార్గపు చర్యలను చిన్నచిన్న పరిశ్రమ అధిపతులు వర్తక వ్యాపారస్తులు గృహ అవసరాలకు విద్యుత్ వినియోగించే వినియోగదారులు, ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు . అలాగే ట్రూ అప్ చార్జీల పేరున నేడు ప్రజలపై మరింత భారం వేశారని యూనిట్‌కి రెండు మూడు రూపాయలు ఉంటే అదనంగా 3.50 పైసలు ట్రూ అప్ చార్జీలు పేరట అన్ని వర్గాల ప్రజలపై భారం వేశారని ఇంతటి భారం గతంలో ఏ ప్రభుత్వం కూడా వేయలేదని విమర్శించారు. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు తెలుగుదేశం జనసేన పార్టీలు విద్యుత్ చార్జీలను వ్యతిరేకించాయని, అదేవిధంగా స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగిస్తే బద్దలు కొట్టండని ఆనాటి ప్రతిపక్ష పార్టీ నాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి తనయుడు, నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారని, నేడు అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విధానాలను అంతకంటే ఘోరంగా అమలు చేస్తూ స్మార్ట్ మీటర్లు బిగింపుకు సిద్ధపడుతున్నారని వారు విమర్శించారు. ఇదే విధానం కొనసాగితే మరో బషీర్బాగ్ ఉద్యమం కూటమి ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా స్మార్ట్ మీటర్లు బిగింపు ఉపసంహరించుకోవాలని, చార్జీలు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలను చైతన్య పరుస్తూ ఉద్యమానికి సిద్ధం చేయాలని సంకల్పంతో సంతకాల సేకరణ చేస్తున్నామని, ఆగస్టు 5న మండలంలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు చేయాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ జిల్లా రాష్ట్ర కమిటీలు పిలుపునిచ్చాయని, ఆ ధర్నా కార్యక్రమాలకు ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు కుంచే నాగేంద్రబాబు, గూడే ఆశీర్వాదం, నెట్టా రామారావు, సిహెచ్ గంగాధర్‌రావు, గోలిమే బేబి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు వేతనాలు చెల్లించాలి

- ఉపాధి కూలీల ఆకలి కేకలు
- 60 రోజులుగా వేతనాల కోసం ఎదురుచూపులు

విశాలాంధ్ర- పెనుమంట్ర: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన ఉపాధి కూలీలు వేతనాలు అందక పస్తులతో గడుపుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 1.29 లక్షల మంది ఉపాధి కూలీలు ఉన్నారు. మే నెల 20 నుంచి వేతనాలు అందలేదు. దీంతో ఏకంగా కూలీలకు రూ.48 కోట్లు వేతనాల రూపంలో చెల్లించాల్సి ఉండడం ఆందోళన కలిగిస్తుంది. వేతనాల జమలో జాప్యం కారణంగా జీవనం కష్టాల్లో పడ్డాయని వేతన దారులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు కష్టపడిపనిచేసినా, వేతనం వచ్చేది లేదని చెబుతున్న కూలీలు -ప్రభుత్వమే ఆర్థికంగా వెనకడుగు వేస్తోందా అని ఉపాధి కూలీలు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో పనులు పూర్తయినప్పటికీ, వారి కృషికి తగిన గౌరవం అందడంలేదని ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వేతనాల సొమ్ము విడుదలలో జాప్యానికి అధికారి యంత్రాంగమే ప్రధాన కారణంగా ఆరోపణ వినిపిస్తున్నాయి. స్థానికంగా పనికి సంబంధించిన వివరాలను నివేదించడంలో జాప్యం జరగడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లుగా చెబుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, పెండింగ్‌లో వేతనాలను తక్షణ విడుదల చేయాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు. ఉపాధి హామీ జిల్లా అధికారి ఎ.అప్పారావును వివరణ కోరగా జిల్లా పరిధిలో రూ. 48.12 కోట్లు రావలసి ఉందని కేంద్ర ప్రభుత్వం 15 రోజుల్లో విడుదల చేసి దశలవారీగా వారి వారి ఖాతాల్లో జమ అవుతాయన్నారు.

వాట్సాప్‌లోనే రిజిస్టర్ డాక్యుమెంట్

- రిజిస్ట్రేషన్ శాఖలో మరో కొత్త సర్వీసు అందుబాటులోకి...
- పారదర్శకం కోసమే అంటున్న ప్రభుత్వం

విశాలాంధ్ర- కొవ్వూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలను మరింత మెరుగుపరిచేందుకు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్ధంగా వినియోగించుకుంటోంది. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ వాట్సాప్ ద్వారానే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు వంటివి అందించే ఏర్పాట్లు చేశారు. సుమారు 300 సేవలు వాట్సాప్‌లోనే అందుతున్నాయి. ఇప్పుడు తాజాగా రిజిస్ట్రేషన్ల శాఖ ఆ జాబితాలో చేరింది. ఏదైనా ఆస్తిని రిజిస్టర్ చేసినప్పుడు ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఒరిజనల్ డాక్యుమెంట్ కాపీని కొనుగోలుదారుడి మొబైల్ నంబరుకు వాట్సాప్‌లో పంపించే ఏర్పాటు చేశారు. తొలి విడతగా విశాఖ జిల్లాలో ఈ సర్వీసును ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటివరకూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌ను డాక్యుమెంట్ రైటర్లే సాయంత్రం వేళ తీసుకొని ఆ తరువాత తీరుబడిగా కొన్నవారికి ఇస్తున్నారు. దీని కోసం రిజిస్ట్రేషన్ సమయంలో 'నామినీ' పేరు రాయించేవారు. ఇప్పుడు వాట్సాప్ ద్వారా ఆ డాక్యుమెంట్‌ను వెంటనే పంపడానికి రిజిస్ట్రేషన్ల శాఖ కార్డ్ 2.0. సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసింది. రిజిస్ట్రేషన్ సమయంలో ఆస్తి కొనుగోలుదారుని మొబైల్ నంబరు నమోదు చేయాలని అడుగుతుంది. నమోదు చేశాక దానిని వారి దగ్గరున్న ఆధార్ బేస్డ్ సమాచారంతో నిర్ధారించుకుంటుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయి, డాక్యుమెంట్ డిజిటల్ స్కానింగ్ జరిగిన తరువాత సిస్టమ్ నుంచి ఆటోమేటిక్‌గా నమోదుచేసిన మొబైల్ నంబరుకు డాక్యుమెంట్ కాపీ వాట్సాప్‌లో వెళ్లిపోతుంది. మొబైల్‌లోనే ఓపెన్ చేసి చూసుకోవచ్చు. ఆ తరువాత సదరు వ్యక్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి బయోమెట్రిక్ వేసి ఒరిజినల్ దస్తావేజులను తీసుకువెళ్లే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. పారదర్శకత కోసమే ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ప్రభుత్వం చెబుతోంది.

4న ఆటో కార్మికులతో కార్మిక మంత్రి

విశాలాంధ్ర - అమలాపురం : ఆంధ్ర ఆటోవాలా జిల్లా అధ్యక్షులు వాసంశెట్టి సత్తిరాజు నాయకత్వంలో యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ కె సత్తిబాబు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఊటాల వెంకటేష్, అమలాపురం డివిజన్ అధ్యక్షుడు బొలిశెట్టి గౌరీశంకర్, రావులపాలెం యూనిట్ అధ్యక్షులు చిక్కల నాగేశ్వరరావు, కార్యదర్శి కుడిపూడి కిరణ్, తదితర కమిటీ సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ని కలిసి ఆటో కార్మిక సమస్యలు సవిరంగా తెలుపు కొనుట మాకు సమయం కేటాయించాలని కోరారు. వారు సానుకూలంగా స్పందించి ఆగస్టు 4న ఉదయం పూట కార్మిక సమస్యలు వినడానికి సమయం కొసంగినందున జిల్లా వ్యాప్తంగా ఆటో ఓనర్ కమ్ డ్రైవర్లు ఎక్కడి కక్కడ డివిజన్ సమావేశాలు ఏర్పాటు చేసుకుని మన జీవన ప్రమాణాలు మెరుగుదలకోసం రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రం సిద్ధం చేసేందుకు వెంటనే సన్నాహాలు ప్రారంభించాలని ఆంధ్ర ఆటోవాలా జిల్లా కమిటీ పిలుపునిచ్చిందనీ అధ్యక్షు జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ఒక ప్రకటన విడుదలజేశారు.

ప్రపంచ స్థాయి పోటీకి సిద్ధం కావాలి : సతీష్‌రెడ్డి

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో గల ఎంబిఏ, ఎంసిఏ, బీబీఏ, ఫోరెన్సిక్ విభాగాలకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు నేటి నుంచి తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థి తల్లిదండ్రుల సమావేశంలో ప్రో ఛాన్సలర్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు తమ కర్తవ్యాన్ని లక్ష్యాలను నిరంతరం గుర్తెరిగి మసలుకోవాలన్నారు. నేడు ప్రతి విద్యార్థి ప్రపంచస్థాయి పోటీని ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. ఆదిత్య యూనివర్సిటీ పై అపార నమ్మకంతో తమ చిన్నారులను తమ సంస్థలో చేర్పించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ విద్యార్థి ఉన్నతికి ఆదిత్య యాజమాన్యం ఎల్లవేళలా కృషి చేస్తుందని అయితే తల్లిదండ్రులు మీ వంతు సహకారం ఆదిత్యకు అందిస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం ఎంతో సులభం అని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ తమ పిల్లలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తరచు కళాశాలకు వచ్చి వారి యొక్క విద్యా పరమైన మరియు హాజరు తదితర సమాచారం తెలుసుకోవాలని సూచించారు. ఉత్తీర్ణత సాధించడం పెద్ద కష్టం కాదు అని మంచి కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగంతో మీ చిన్నారులను తీర్చిదిద్దటానికి మీరు మేము కలిసి ముందుకు సాగాలని సూచించారు. ఆదిత్య యూనివర్సిటీ స్వతంత్ర ప్రతిపత్తితో విద్యార్థి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నేటి పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళిక రూపొందించడం జరిగింది అని, విదేశీ యూనివర్సిటీలతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుని విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్నామని సతీష్ రెడ్డి తెలిపారు. డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాసరెడ్డి, స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ డా రవి తంగజన్, ప్రో వైస్ చాన్సలర్‌లు డా విపి రమేష్, డా ఎస్ రమాశ్రీ, రిజిస్ట్రార్ డా జి సురేష్ ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

షేక్ వలి, తండ్రి ఇస్మాయిల్, వయస్సు 34 అను నేను గోపాలపురం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన వాడను, నాకు భారత ప్రభుత్వం ద్వారా U 1850021 నంబరు గల పాస్‌పోర్ట్ కలిగి ఉన్నాను. ఇటీవల జిరాక్స్ నిమిత్తం గోపాలపురంలోని జిరాక్స్ సెంటర్‌కు వెళ్లి వచ్చు సమయంలో నా యొక్క పాస్‌పోర్టు పోయినదని తరువాత గ్రహించాను. కావున పైన తెలిపిన నంబరు గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది సెల్‌ఫోన్ నెంబర్‌కు తెలియచేసి సహకరించగలరు.

సెల్ నెంబర్: 9701215840

అరకొర వసతులతో కుట్టుమిషన్ల శిక్షణ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రెండు నెలలుగా బిసి కార్పొరేషన్ వారి సహకారంతో 128 మంది మహిళలకు కుట్టు మిషన్లు శిక్షణా తరగతులు జరుగుతున్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ శిక్షణా తరగతులు రెండు విడతలుగా జరుగుతున్నాయి. ఈ శిక్షణా తరగతులకు బీసీ కార్పొరేషన్ నుండి 25 కుట్టు మిషన్లు మంజూరు చేశారు. ఈ మిషన్లలో 14 పని చేయడం లేదు అని 11 మాత్రమే పని చేస్తున్నాయి అని శిక్షణ పొందుతున్న మహిళలు తెలిపారు. ఈ కుట్టు మిషన్లు పని చేయక పోవడం శిక్షణ పొందుతున్న మహిళలు చాలా సమయం కాలిగా ఉండాల్సి వస్తుంది అని అవేదన వ్యక్తం చేశారు. అధికారులు మహిళలకు సజావుగా శిక్షణ అందే విధంగా చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

మాజీ సైనికులకు రక్షణ కల్పించాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు హారిక

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం సిటీ: దేశం కోసం శ్రమించిన మాజీ సైనికులను కాపాడుకోవలసిన బాధ్యత అందరి మీద ఉందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు హారిక నర్సిపల్లి అన్నారు.కార్గిల్ విజయ్ దివస్ లో భాగంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు చిరు సత్కారం చేసే ఉద్దేశ్యంతో స్థానిక గోరక్షణ పేట మాజీ సైనిక సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. దేశానికి రక్షణ కల్పించే మాజీ సైనికులకు రక్షణ కల్పించాలని, వారు భవిష్యత్తో మరింత మంది యువ సైనికులను తయారు చేసే విధంగా కృషి చేయాలన్నారు. మాజీ సైనికుల కుటుంబాల కోసం తాను చిత్తశుద్ధితో పని చేస్తున్నానని, కార్గిల్ దివస్ సందర్భంగా దేశ వ్యాప్తంగా ఉన్న మాజీ సైనికులను సత్కరించాలన్న ప్రధాని మోదీ పిలుపు మేరకు నేడు ఇక్కడ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మాజీ సైనిక సంఘ కార్యాలయాన్ని నిర్మించడానికి తన వంతు కృషి చేస్తున్నానన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ మాట్లాడుతూ, కార్గిల్ లో పోరాటం చేసిన వారినం దరినీ సత్కరించుకోవాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఆనందించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న నాగేశ్వరరావు(ఆర్మెరి లెఫ్ట్ నెంట్), శ్రీహరి (నేవీ), ఎస్.ఎన్. అలీషా(ఎయిర్ ఫోర్స్)లను బిజెపి నేతలు పరిమి రాధా కృష్ణ , బొమ్ముల దత్తు, నీరుకొండ వీరన్న చౌదరి, ఏసు, రేలంగి శ్రీదేవి, అడబాల రామకృష్ణలు ఘనంగా సత్కరించి , వారి సేవలను కొనియాడారు. సభకు మాజీ సైనిక సంక్షేమ సంఘం తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు గంధం ప్రసాదరావు అధ్యక్షత వహించారు. కార్యదర్శి గంట చంద్ర శేఖర్, పి.లక్ష్మి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎటువంటి ఒత్తిడి చేయలేదు

విశాలాంధ్ర - ఏలూరు : ఉపాధ్యాయులెవరినీ కూడా పీ4 లో గుర్తించిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఎటువంటి ఒత్తిడి చేయలేదని జిల్లా విద్యా శాఖాధికారి వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ విషయంలో జిల్లా కలెక్టర్ వారు మండలానికి 190 ప్రధానోపాధ్యాయులు/స్కూల్ అసిస్టెంట్ లను మార్గదర్శకులుగా రిజిస్టర్ చేయమని ఎక్కడా ఆదేశాలు జారీ చేయలేదన్నారు. పీ4 కార్యక్రమంలో మార్గదర్శిగా నమోదు స్వచ్ఛంద కార్యక్రమమని డీఈఓ స్పష్టం చేస్తూ పీ4 కార్య క్రమంలో మార్గదర్శిగా భాగస్వాములు కావడానికి ఆసక్తి ఉన్న ఎవరైనా స్వచ్ఛందంగా మాత్రమే తమను తాము నమోదు చేస్తుకో వచ్చని వివరించారని డీఈఓ చెప్పారు. ఉపాధ్యాయులకు బోధనేతర విధులను అప్పగించడం జిల్లా కలెక్టర్ కూడా వ్యతిరేకమన్నారు. పీ4 లో గుర్తించిన బంగారు కుటుంబాలను ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాలని,ఆ మేరకు మార్గదర్శకులుగా రిజిస్టర్ కావాలని జిల్లా విద్యా శాఖ నుండి ఒత్తిళ్లు వస్తున్నాయన్న నిరాధార ఆరోపణలు చేయడం తగదని డీఈ ఓ వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

మెడ్‌స్కిల్స్‌లో తక్కువ ఖర్చుతో వైద్యవిద్య

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం సిటీ : నీట్ పరీక్షల్లో పాసై, సీటు పొందలేని విద్యార్థులు ఇక నుంచి బాధ పడనవసరం లేదు. మీరు నీట్ పాసైతే చాలు అన్ని సదుపాయాలతో అతి తక్కువ ఖర్చుతో మీరు ఎంబిబిఎస్ పూర్తి చేయవచ్చంటున్నారు అపోలో మెడ్ స్కిల్స్ అఫీషియల్ ఎన్ రోల్ మెంట్ పార్టనర్ అలీ. నేడు దేశంలో ఏటా 25 లక్షల మంది పరీక్షలు రాస్తున్నారని, వారిలో సుమారు 13 లక్షల మందే క్వాలిఫై అవుతున్నారని, వారిలో కూడా కేవలం లక్షకు మించి విద్యార్థులకు సీట్లు రావడం లేదన్నారు. ఈ సమస్యను గుర్తించి, నీట్ పాసై ఎంబిబిఎస్ చదువు కొనసాగించాలనుకునే విద్యార్థులు అపోలో మెడ్ స్కిల్స్, దువెంటస్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఉజ్బెకిస్తాన్ లోని జార్మెడ్ విశ్వవిద్యాలయంలో హేపీగా ఎంబీబిఎస్ చదువుకో వచ్చన్నారు. స్థానిక శ్రీ కన్య గ్రాండ్ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ సంస్థ ద్వారా కేవలం 35 లక్షలకు ఆరు సంవత్సరాల ఎంబిబిఎస్ ప్రోగ్రామ్‌ను అందు బాటులోకి తెచ్చామన్నారు. ఉజ్బెకిస్తాన్ దేశం ప్రశాంతమైన దేశమని, భారత్ తో కూడా ఆ దేశానికి మంచి సంబంధాలున్నాయని, వాతావరణం కూడా చాలా ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. దీనికి తోడు ఢిల్లీ నుంచి కేవలం రెండున్నర గంటల వ్యవధిలో ఆ దేశానికి వెళ్ళొచ్చన్నారు. దేశంలో ఎంబిబిఎస్ యాస్పి రెంట్స్ తమ డాక్టర్ కలను నిజం చేయడానికి అపోలో సంస్థ సహకారంతో అపోలో మెడిస్కిల్స్ పేరుతో తాము ప్రాజెక్టు చేపట్టామన్నారు. నీట్ లో ర్యాంకు వచ్చి, ఎంబిబిఎస్ చేయాలనుకునే విద్యా ర్థులు అతి తక్కువ ఖర్చుతో తమ ఎంబీబిఎస్ పూర్తి చేయవచ్చన్నారు. గతంలో విదేశాలలో ఎంబిబిఎస్ విద్యను అభ్యసించిన విద్యార్థులు ఎఫ్ ఎంజిఈ రాయాల్సి వస్తుందని, కానీ దానిలో పాస్ పర్సంటేజ్ కేవలం ఆరు నుంచి 20 శాతం వరకు మాత్రమే ఉం దన్నారు. అలాగే 2025 బ్యాచ్ నుంచి భారత ప్రభు త్వం కూడా నెక్స్ట్ (ఎన్ ఈ ఎక్స్ టీ) అనే పరీక్ష పెడు తుందని, అందులో పాసైన విద్యార్థులకు మాత్రమే మన దేశంలో ప్రాక్టీసు చేసే అవకాశం ఉంటుం దన్నారు. కనుక తమ సంస్థ ద్వారా చదువుకునే విద్యా ర్థులకు, ఎఫ్ ఎంజిఈ , నెక్స్ట్ పరీక్షలలో సులువుగా పాసయ్యేందుకు వీలుగా తాము విద్యార్థులకు శిక్షణనిస్తామన్నారు. అలాగే, అక్కడ విద్యార్థులకు పాఠాలు బోధించడానికి ఇండియన్ ప్రొఫెసర్లను ఏర్పాటు చేస్తున్నామని, మన వంటకాలకు అను గుణంగా ఇండియన్ చెఫ్‌లను కూడా అక్కడ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కనుక మన దేశ విద్యార్థులు తమ సంస్థ ద్వారా చాలా సులువుగా ఎంబిబిఎస్ చదువు కోవచ్చని, అతి తక్కువ ఖర్చుతో డాక్టర్లు కావచ్చు న్నారు. జార్మెడ్ యూనివర్శిటీకి చెందిన అడ్మిషన్ ఆఫీసు జూబ్లీ హిల్స్‌లోని రోడ్ నెంబర్ 36లో ఉం దని, ఇతర వివరాల కోసం 9160022009, 9849122588 అనే నెంబర్లలో సంప్రదించవచ్చు న్నారు. ఈ కార్యక్రమంలో సంస్థకు చెందిన కెఆర్ కె రాజు, ఎస్ఎన్ రాజు, వి. రమేష్‌లు పాల్గొని విలేకరుల సందేహానివృత్తి చేశారు.

ప్రజల సంక్షేమమే ప్రథమ కర్తవ్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర -జీలుగుమిల్లి : సమస్యలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తక్షణమే పరిష్కరించే దిశగా అధికారు లను ఆదేశించడం జరుగుతుందని పోలవరం ఎమ్మెల్యే సిరి బాలరాజు అన్నారు. సోమవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోనే ఏ సమస్య అయినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. సంబంధిత శాఖ అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజా సమస్యలపై చూపుతున్న స్పందన పట్ల బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సంక్షేమమే నాకు ప్రథమ కర్తవ్యం అని అన్నారు. ఇంతవరకు ఏ నాయకుడు చేయని విధంగా ప్రజల అభ్యర్ధనలను స్పందిస్తూ సమస్యలను తీర్చడం గొప్ప విషయమని స్థానికులు అభినందిస్తున్నారు.

వైసీపీ వర్గపోరుతో కార్మికులకు నష్టం

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : వైసీపీ పాలనలో నష్టపోయిన పేపరుమిల్లు కార్మికులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే న్యాయం చేసిందని మాజీ కార్పొరేటర్ మొకమాటి సత్యనారాయణ, కార్మిక నాయకుడు దుత్తరపు గంగాధర్ అన్నారు. సోమవారం మిల్లు కార్మిక సంఘాల నాయకులతో కలిసి వారు మీడియాతో మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మిల్లు కార్మికులకు అగ్రిమెంట్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వారి వర్గపోరుతో కార్మికులకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్ తదితరులు మిల్లు కార్మికుల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రిన్సిపాల్ సెక్రటరీ దృష్టికి తీసుకు వెళ్లి వారికి న్యాయం జరిగేలా కృషి చేశారన్నారు. త్వరలో మిల్లు గుర్తింపు యూనియన్ ఎన్నికలు, మంచి అగ్రి మెంట్ కూడా జరుగుతుందన్నారు. ఎప్పుడైనా టీడీపీ హయాంలోనే మిల్లు కార్మికులకు మంచి అగ్రిమెంట్ జరిగిందని, ఎన్నికలు కూడా జరి గాయని అన్నారు. వైసీపీ నాయకుల మధ్య విభే దాలు పేపరుమిల్లు కార్మికులకు నష్టం కలిగిం చాయన్నారు.వైసీపీ నాయకులు సూట్ కేస్ నాయ కులని, కూటమి ప్రజాప్రతినిధులు అలా ఎప్పుడూ సూట్ కేసులకు ఆశపడరని అన్నారు. మిల్లు సీఎస్ ఆర్ నిధులు నగరంలో అభివృద్ధి పనులకు ఖర్చు చేసే విధంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కృషి చేస్తు న్నారని గుర్తు చేశారు. తాము ధర్నాలు, దీక్ష చేయ డంవల్లే జరిగిందని వైసీపీ నాయకులు చెప్పుకో వడం హాస్యాస్పదమని, అలాగైతే వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ళు ఎందుకు చేయలేకపో యారని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో వర్గపోరు లో నష్టపోయిన కార్మికులకు నాడు ప్రతిపక్ష నాయ కులుగా ఉన్న ఆదిరెడ్డి శ్రీనివాస్, కందుల దుర్గేష్, తదితరులు తాము అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, అందుకు తగినట్లుగానే కార్మికులకు వేతనాలు పెంపు జరిగిందని, వైసీపీ నాయకుల వల్ల కాదని అన్నారు. 2024 ఏప్రిల్ లో తాము సమ్మె చేస్తుంటే ఎన్నికల ప్రచారానికి వచ్చిన జగన్ కార్మిక నాయకులను తన బస్సులోకి పిలిచి మిల్లు కార్మికులకు ఇప్పటికే జీతాలు ఎక్కువ అని, సమ్మె చేస్తే మిల్లు మూసేస్తారని అనడం వైసీపీ నాయకులకు గుర్తు లేదా అని ప్రశ్నించారు. కార్మి కులకు మూడు సంవత్సరాల ఆరు నెలలకు ఒక సారి అగ్రిమెంట్ జరగాలని, 2019 లో అప్పటి మంత్రి పితాని సత్యనారాయణ హయాంలో అగ్రిమెంట్ చేశారని తర్వాత వచ్చిన వైసీపీ పాలనలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు కార్మికులను గాలికి వదిలేశారని, పరంపర కార్మికులకు కూడా న్యాయం చేయలేక పోయారని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పరంపర కార్మికులకు కూడా న్యాయం చేశా రని చెప్పారు. మీడియా సమావేశంలో మిల్లు టిఎన్టీయుసీ ప్రెసిడెంట్ ఎం బోసు, కార్యదర్శి కె రమణ రావు, కార్మికులు కళ్యాణ్, సురేష్, ఎన్ విజయ్, అశోక్, ఏం మహేష్ పాల్గొన్నారు.

దీపపు కుందు బహుకరణ

విశాలాంధ్ర - గణపవరం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు దీపపు కుందు, ఉరిలి (నీటితో నింపి పూల ను పెట్టే పాత్ర)ల బహుకరణ చేసినట్లు గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరొ నిర్మల కుమారి అన్నారు. సోమవారం గణపవరం గ్రామానికి చెందిన నడింపల్లి శ్రీరామ్ కళా శాల సిపి డిసి మెంబర్ రూ 12 వేలు విలువ చేసే దీపపు కుందు, ఉరిలి (నీటితో నింపి పూల ను పెట్టే పాత్ర) లను బహుకరించడం జరిగింది. వీటిని బహుకరించిన శ్రీరామ్‌ను ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, డాక్టర్ కె స్వరూప రాణి,డా.సిహెచ్.చైతన్య అధ్యాపక బృందం కెవి గణేష్ కుమార్, సుబ్బా రాజు, లక్ష్మి కుమారి, విద్యార్థులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

మంచినీటి పైపులైనుకు శంకుస్థాపన

విశాలాంధ్ర - పాలకోడేరు : పాలకోడేరు మండలం మోగల్లు గ్రామంలో మంచి నీటి పైపు లైన్ కోసం ఎన్నో దశాబ్దాలుగా ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న మంచినీటి పరిష్కారానికి ఉండి నియోజక వర్గం శాసనసభ్యులు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామకృష్ణరాజు ఆదేశాల మేరకు నాయకులు కొత్తపల్లి నాగరాజు, కొత్త పల్లి సూర్యనారాయణరాజు గ్రామ సర్పంచ్ శ్రీమతి మల్లిపూడి కృష్ణ కుమారి సపోర్ట్‌తో వేంద్ర గ్రామం పెద్ద కాలువ నుంచి కోటి రూపాయలు పైబడి నిధులతో పైపులైన్ వేయడానికి అన్ని ఏర్పాట్లు చేసి సోమ వారం స్థానిక నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మోగల్లు గ్రామ మంచినీటి పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు గ్రామ ప్రజలందరూ స్థానిక శాసనసభ్యులు కనుమూరు రఘురామకృష్ణంరాజు కు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుజాత, పంచాయతీ వార్డు మెంబర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాంబాబును స్ఫూర్తిగా తీసుకోవాలి : కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర - భీమవరం : సేవా తత్పరతతో మరింత మంది పి-ఫోర్ కార్యక్రమంలో భాగస్వా మ్యులు కావాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ అర్జీదారు లకు ప్రతి సోమవారం వీరవాసరం తులసి రాం బాబుచే ఏర్పాటు చేయనున్న భోజన సదుపాయాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి లాంచనంగా ప్రారంభిం చారు. ఈ సందరరేగా కలెక్టర్ మాట్లాడుతూ వీర వాసరం తులసి రాంబాబు ఇప్పటికే వీరవాసరం మండలంలోని 18 గ్రామాల్లో సుమారు 200 మందికి పైగా వయోవ ృద్ధులు, ఏ ఆధారం లేక వండుకోలేని పరిస్థితిలో ఉన్న వారికి రెండు పూటలకు సరిపడా క్యారేజీని వారి ఇంటి వద్దకే అందజేయడం జరుగుతుందన్నారు. ఇటీవల వారి సేవా కార్యక్రమాలను స్వయంగా వెళ్లి పరిశీలించడం జరిగిందన్నారు. ప్రతి సోమవారం వివిధ ప్రాంతాల నుండి కలెక్టరేట్ పీజిఆర్ఎస్ కు వచ్చే 200 మంది అర్జీదారులకు కూడా మధ్యా హ్నం భోజనాన్ని అందజేయడానికి తులసి రాంబాబు ముందుకు వచ్చా రని, ఈ పరిణామం అభినందిం చదగిన విషయం అన్నారు. రాంబాబు, వారి కుటుం బ సభ్యులు ఇటువంటి గొప్ప సేవా కార్యక్రమంలో పాలుపంచుకుని పేదల ఆకలిని తీర్చడం జిల్లాకే గర్వకారణంగా కొనియాడారు. తులసి రాంబాబు సేవా తత్పరతను సూర్తేగా తీసుకొని జిల్లాలో దాత ృత్వ హృదయము కలిగిన సంపన్న వర్గాలు రాష్ట్ర ప్రభు త్వం చేపట్టిన పి-ఫోర్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సం దరరేగా రాంబాబు సతీమణి మల్ల వరలక్ష్మీ, కుమార్తె గోవర్ధిని లను కలెక్టర్ శాలువా కప్పి అభినందిం చారు. కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, మల్ల వరలక్ష్మీ, కుమార్తె గోవర్ధిని, వివిధ శాఖల జిల్లా అధికారులు, పిజిఆర్ఎస్ అర్జీదారులు, పాల్గొన్నారు.

బోధనేతర పనులకు ఉపాధ్యాయులను దూరం పెట్టాలి

విశాలాంధ్ర -పాలకోడేరు : రాష్ట్ర ప్రభుత్వం పీ4 పేరుతో ఉపాధ్యాయులను కొన్ని కుటుంబాలను దత్తత తీసుకోమని దానికోసం వెంటనే రిజిస్టర్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు సర్క్యులర్ పెట్టడం, ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడాన్ని యూటీఎఫ్ ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్ విజయరామరాజు, ఏ కె.వి రామభద్రం ఒక ప్రకటనలో ఖండించారు. సోమవారం స్థానిక పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే బోధనేతర పనులతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయటం దాని వలన విద్యార్థులలో అభ్యసనం మందగిస్తుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ బదిలీలు ప్రమోషన్ అయిన తర్వాత ఎక్కువ శాతం ఉపాధ్యాయులకు జీతాలు అం దక జీతాలు చేసుకునే అవకాశం ఇవ్వకుండా ఉండ టం ఉపాధ్యాయులు మానసిక ఆందోళనకు మరియు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు.సమాజంలో పేదరిక నిర్మూలనకు స్వచ్ఛంద సంస్థలను అంటే నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ లను ఉపయోగించుకోవాలి లేదా ఎన్నారైలు ఆసరా కోసం ప్రత్యేకంగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకొని ఆ ప్రోగ్రాం విజయవంతం చేస్తే బాగుంటుంది అని అబి ప్రాయపడ్డారు. అంతేగాని విద్యార్థులకు బోధన చేయ వలసిన ఉపాధ్యాయులను బోధన చేయనివ్వకుండా కర్మయోగి యాప్ లు వీడియోస్ ఓపెన్ చేసి గంటల తరబడి చూడటం అలాగా చూడని వాళ్లను మెసేజ్లు ద్వారా పేర్లతో గ్రూపులలో పోస్ట్ చేయటం విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తుంది అని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఉపాధ్యాయుల ఆందోళన బాట పట్టవలసి వస్తుందని జిల్లా అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శులు పిఎస్ విజయరామరాజు ఏకేవీ రామభద్రం ఒక ప్రకటనలో తెలిపారు.

దాతల సహకారంతో గ్రామాల అభివృద్ధి

విశాలాంధ్ర - కలిదిండి : దాతలు సహకరిస్తే గ్రామాలు మరింత అభివ ృద్ధి చెందుతాయని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు.పార్థసారథి ఎమ్మెల్యే కామినేని. శ్రీనివాస్ అన్నారు. సోమవారం కలిదిండి గ్రామంలో కోరుకొల్లు రోడ్డులో ఉన్న హిందూ సమస్త కుల మహా రుద్రభూమి అభివ ృద్ధి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామానికి చెందిన దొంతుబోయిన. వెంకట్రామయ్య కుమారుడు ఎన్నారై దొంతుబోయిన. లెనిన్ బాబు, నళిని దంపతులు దొంతుబోయిన అవుట్ రిచ్ ట్రస్ట్ రూ కోటి తో మహా రుద్రభూమి చుట్టూ ప్రహరీ నిర్మాణం, వీడ్కోల ప్రాంగణం ఆధునిక హంగు లతో నిర్మాణం చేయడం అభినందనీయమన్నారు. గ్రామాలు అభివ ృద్ధి చెందాలంటే దాతలు మరింత మంది ముందుకు వచ్చి అభివ ృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. లెనిన్ బాబు, నళిని దంపతులను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి. విటల్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పోకల. జోగిరాజు, గోరిపర్తి. నాగేశ్వర రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభనేని. శ్రీనివాస్ చౌదరి, మాజీ జెడ్పిటిసి నున్న. రమాదేవి, అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఆంద్రాజు. శ్రీనివాసరావు, పెట్టేటి. సత్యనారాయణ, ముద్దం. భోగేశ్వరరావు, సర్పంచి మసిముక్కుల. మారుతి ప్రసన్న, మేడిశెట్టి. సీతారామాంజనేయులు, నున్న. క ృష బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం మానుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం : ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజుపై చేస్తున్న అసత్య ప్రచారం మానుకోవాలని జనసేన పార్టీ నిడమర్రు మండల అధ్యక్షుడు నిమ్మల దొరబాబు నిడమర్రు మండల గ్రామ పార్టీ అధ్యక్షులు సోమ వారం అన్నారు. ఆయన మాట్లాడుతూ ఎటు వంటి కళంకం లేని వ్యక్తి ధర్మరాజు అని రాజకీయాల్లోకి రాకముందే కష్టపడి సంపాదించుకు న్నారని ఇప్పుడు అక్రమంగా సంపాదించుకో వలసిన అవసరం లేదన్నారు. కొన్ని తప్పుడు సోషల్‌మీడియాలో, కొన్ని చానల్స్ లో కొంత మంది గిట్టని వారు అసత్య ప్రచారాలను చేస్తు న్నాయని అన్నారు. రాజకీయాల్లోకి రాకముందే ధర్మరాజు తన తండ్రి శ్రీ లక్ష్మీనారాయణ ట్రస్టు ఏర్పాటుచేసి ద్వారకాతిరుమల నడిచి వెళ్లే భక్తు లకు అన్నదానం, గ్రామాల్లో ఎక్కడైనా మంచినీటి ఇబ్బంది ఉంటే ట్యాంకర్ల ద్వారా తాగునీరును సరఫరా చేసే వారిని ఆయన అన్నారు. అసత్య ప్రచారాలు చేసే వ్యక్తులు ఆధారాలతో తమ ముం దుకు రావాలని హెచ్చరించారు. అసత్య ప్రసా రం చేసేవారు తగిన మూల్యం చెల్లించవలసి ఉం టుందని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్క గ్రామంలో ఆయన చేస్తున్న అభివృద్ధి కార్యక్ర మాలు ప్రజలకు చూపిస్తామని అన్నారు.